News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :277 | ఖమ్మం | మంగళవారం నవంబర్ 18, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం..
# 45 మంది మృతి





- పవిత్ర యాత్రలో పెను విషాదం
- సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఉమ్రా యాత్రకు వెళ్లిన 45 మంది హైదరాబాదీల సజీవదహనం
- డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న యాత్రికుల బస్సు
- మదీనాకు 25 కి.మీ. దూరంలో ఘటన
- ప్రాణాలతో బయటపడిన డ్రైవర్, మరో యువకుడు
- ప్రధాని, సీఎం, ఇతర ప్రముఖుల సంతాపం

వివరాలు 2లో..

### సౌదీ బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, జగన్ ప్రగాఢ సానుభూతి

- సౌదీ అరేబియాలో ఉమ్రా యాత్రికుల బస్సు ప్రమాదం
- మృతుల్లో అత్యధికులు తెలంగాణ వాసులుగా వెల్లడి
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి
- మాజీ సీఎం జగన్, మంత్రి లోకేశ్, షర్మిల సంతాపం
- మృతదేహాలను రప్పించాలని కేంద్రానికి షర్మిల విజ్ఞప్తి




### సౌదీ బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం...

- మక్కా నుంచి మదీనాకు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదంలో 45 మంది మృతి
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రివర్గం
- అంత్యక్రియల కోసం ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీకి పంపించాలని నిర్ణయం



## స్పీకర్ వైఖరి కోర్టు ధిక్కారమే



- కొత్త సంవత్సరం ఎక్కడ జరుపుకోవాలనుకుంటున్నారో నిర్ణయించుకొనే స్వేచ్ఛను ఆయనకే వదిలేస్తున్నాం
- స్పీకర్‌కు రాజ్యాంగ రక్షణ ఉండదు
- ఎమ్మెల్యేల అనర్హత కేసు విచారణలో సీజేఐ జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలు
- 3 పిటిషన్లలో నోటీసులు జారీ.. తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా

: పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు నిర్ణయం వెలువరించాలని సుప్రీంకోర్టు చెప్పినా దానిపై ఇంతవరకు తెలంగాణ స్పీకర్ నిర్ణయం వెలువరించకపోవడం పూర్తిగా కోర్టు ధిక్కారం కిందకు వస్తుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. వచ్చే విచారణ

వివరాలు 2లో..

## 'ఐబొమ్మ' రవి వద్ద 50 లక్షల మంది డేటా ఉంది..

### రూ. 20 కోట్లు సంపాదించాడు

- ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్
- పైరసీ ద్వారా రూ.20 కోట్లు సంపాదించినట్లు వెల్లడి
- పైరసీ ముసుగులో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినట్లు గుర్తింపు



తెలుగు సినీ పరిశ్రమకు వేల కోట్ల నష్టం కలిగిస్తున్న ఐబొమ్మ పైరసీ వెబ్‌సైట్ కేసులో ప్రధాన సూత్రధారి ఇమ్మడి రవిని అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ కేసులో ఆయన విస్తుపోయే నిజాలను మీడియా ముందుంచారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చిరంజీవి, నాగార్జున, దర్శకుడు రాజమౌళి, నిర్మాత దిల్ రాజు తదితరులు సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. ఐబొమ్మ నిర్వాహకుడిని పట్టుకున్నందుకు

వివరాలు 2లో..



## ప్రాజెక్టుల పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

కృష్ణా, గోదావరి నదీ పరీవాహకాల్లో దీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులివ్వాలని, కీలకమైన ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు పలు అంశాలతో సోమవారం ఆయనకు లేఖ రాసినట్లు తెలిసింది. నదీజలాల్లో రాష్ట్ర నీటి హక్కులు కాపాడాలని, ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం నుంచి అనుమతులు వచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రాష్ట్రంలో నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్న పలు ప్రాజెక్టులకు ఆర్థికసాయం అందించాలన్నారు. "90 టీఎంసీల నీటి కేటాయింపులకు

వివరాలు 2లో..

## షేక్ హసీనాకు మరణశిక్ష... ట్రైబ్యునల్ సంచలన తీర్పు

- షేక్ హసీనాపై మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే అభియోగాలు
- షేక్ హసీనాను దోషిగా తేల్చిన అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్
- మరణ శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చిన ట్రైబ్యునల్



:బంగ్లాదేశ్‌లో గత సంవత్సరం జరిగి న అల్లర్ల కేసులో దోషిగా తేలిన మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మర ణశిక్ష విధిస్తూ సంచలన తీర్పును వెలువరించింది.

వివరాలు 2లో..

## ఆటో డ్రైవర్లకు బీమా చెల్లిస్తా



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 5 వేల మంది ఆటో డ్రైవర్లందరికి రూ. 5 లక్షల ప్రమాద బీమా కోసం అవసరమైన ప్రీమియాన్ని తానే చెల్లిస్తానని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హామీ ఇచ్చారు. సోమవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో జిల్లాలోని ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. కేటీఆర్ మాట్లాడుతూ..

వివరాలు 2లో..




## తొలుత 'పంచాయతీ పోరు'

- మార్చిలోగా ఎన్నికలు నిర్వహించకపోతే.. రూ.3 వేల కోట్ల కేంద్ర నిధులు మురిగిపోయే ప్రమాదం
- పార్టీపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం
- కోర్టుల తీర్పులు వచ్చాకే మిగతా స్థానిక సంస్థల ఎన్నికలు
- 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమిట్
- 9న తెలంగాణ దార్శనిక పత్రం విడుదల
- అందెశ్రీ కుమారుడికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం
- క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పార్టీపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి.. గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. పంచాయతీలకు వచ్చే ఏడాది మార్చి ఆఖరులోగా ఎన్నికలు నిర్వహించకపోతే.. 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ. 3 వేల కోట్లు నిలిచిపోయే ప్రమాదమున్నందువల్ల... ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీలతో కలిసి పొంగులేటి విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

వివరాలు 2లో..

ఉగ్రవాదులకు మద్దతు కొనసాగిస్తే..
## తీవ్ర పరిణామాలు
### పాక్‌కు ద్వివేదీ హెచ్చరిక




- ఉగ్రవాద గ్రూపులకు మద్దతును కొనసాగించవద్దని హెచ్చరిక
- ఉగ్రవాదులను, వారికి మద్దతిచ్చేవారిని భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని స్పష్టీకరణ
- అడ్డంకులు సృష్టిస్తే దీటుగా స్పందిస్తామని వెల్లడి

పాకిస్థాన్‌కు భారత సైన్యాధిపతి జనర ల్ ఉపేంద్ర ద్వి వేది తీవ్ర హెచ్చరికలు చేశారు. ఉగ్రవాదులను, వా రి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణి

వివరాలు 2లో..

## సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం

# 45 మంది మృతి

భార్యాభర్తలు... తాతామనవళ్లు.. పెద్దలూపిల్లలు కలిసి... కుటుంబసమేతంగా బయలుదేరిన ఉమ్రా పవిత్ర యాత్ర... అంతిమయాత్రగా మారింది. సౌదీ అరేబియాలోని మక్కాలో పవిత్ర స్థలాలను దర్శించుకుని, ప్రార్థనా మందిరాల్లో ప్రార్థనలు చేసి... మదీనాకు బయలుదేరగా మార్గంమధ్యలో అంతులేని విషాదం చోటుచేసుకుంది. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాద్‌వాసులు సజీవదహనమయ్యారు. మక్కా నుంచి ప్రయాణిస్తున్న బస్సు భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 11 గంటలకు) మదీనాకు 25 కిలోమీటర్ల దూరంలోని ముఫ్రిహత్ ప్రాంతంలో ముందు వెళుతున్న డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొంది. ఒక్కసారిగా బస్సంతా మంటలు వ్యాపించడంతో క్షణాల వ్యవధిలో దగ్ధమైంది. 45 మంది కాలిపోయారు. డ్రైవర్‌తో పాటు షోయబ్ అనే యువకుడు బస్సు అద్దాలు బద్దలుకొట్టి... కిందికి దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. ఘటనపై ఓ కారు డ్రైవర్ పోలీసులకు సమాచారమిచ్చాడు. వారు వచ్చేలోపు బస్సు, ట్యాంకర్ కాలిపోయాయి. తలకు తీవ్ర గాయమైన షోయబ్‌ను సమీపంలోని ఆసుపత్రిలో చేర్చారు. ప్రమాదంపై భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్‌లో పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందింది.దీంతో మృతుల కుటుంబీకులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుల్లో రెండేళ్ల చిన్నారి నుంచి 70 ఏళ్ల వయసున్న వారున్నారు. ఉమ్రా యాత్రకు వెళ్లినవారిలో మరో 8 మంది మక్కాలోనే ఉండిపోవడంతో వారికి ప్రమాదం తప్పినట్లయింది. ఉమ్రా యాత్రకు వెళ్లిన 45 మంది హైదరాబాద్‌వాసులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని 'తెలంగాణ హజ్ కమిటీ' అధికారులు అధికారికంగా ప్రకటించారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ప్రభుత్వం సచివాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసింది. బాధిత కుటుంబ సభ్యులను మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అజారుద్దీన్, కార్వాన్, నాంపల్లి ఎమ్మెల్యేలు కౌసర్ మొహియుద్దీన్, మాజిద్ హుస్సేన్ పరామర్శించారు. మృతులను గుర్తించేందుకు ప్రతి కుటుంబం నుంచి కనీసం ఇద్దరిని మదీనాకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తామని మంత్రి ప్రకటించారు. ఘటనపై ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**మక్కా నుంచి మదీనాకు వెళ్తుండగా...**

హైదరాబాద్‌లోని టోలీచౌకీ, మురాద్‌నగర్, జిర్రా, అడిక్‌మెట్, నల్లకుంట, విద్యానగర్, బోరబండ, మూసారాంబాగ్ ప్రాంతాలకు చెందిన 54 మంది ఉమ్రా యాత్రకు వెళ్లాలని గత నెలలోనే నిర్ణయించుకున్నారు. ఈ నెల 9న హైదరాబాద్ నుంచి బయలుదేరి 23న తిరిగి చేరుకునేలా షెడ్యూలు రూపొందించుకున్నారు. 9న శంషాబాద్ నుంచి బయలుదేరి జెడ్డాకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఈ నెల 10న మక్కాకు వెళ్లారు. ప్రార్థనల అనంతరం చుట్టుపక్కల ప్రాంతాల్లోని పవిత్ర స్థలాలను సందర్శించారు. ఈ నెల 10 నుంచి 16 వరకూ అక్కడే ఉన్నారు. ఆదివారం రాత్రి మదీనాకు బస్సులో బయలుదేరాలనుకున్నారు. 54 మందిలో నలుగురు తమకు ఆరోగ్యం బాగాలేదని, మరుసటిరోజు వస్తామంటూ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. మరో నలుగురు కారులో వస్తామన్నారు. దీంతో డ్రైవర్ సహా 47 మంది బస్సులో బయలుదేరారు. మరికొద్దిసేపట్లో మదీనాకు చేరుకుంటామనగా ముఫ్రిహత్ వద్ద ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను వీరు ప్రయాణిస్తున్న బస్సు వేగంగా ఢీకొనగా... క్షణాల్లో మంటలు చెలరేగి బస్సు మొత్తం వ్యాపించాయి.

**గుండెలవిసేలా రోదనలు...**

ప్రమాదంతో హైదరాబాద్‌లోని టోలీచౌకీ, నటరాజ్‌నగర్, జిర్రా ప్రాంతాల్లో మృతుల నివాసాల వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులు గుండెలవిసేలా రోదించారు. బజార్‌ఘాట్‌లోని అల్‌మీనా ట్రావెల్స్ కార్యాలయానికి, మెహిదీపట్నంలోని ఫ్లైజోన్ కార్యాలయానికి వెళ్లగా... అవి మూసి ఉండటంతో పోలీసులను సంప్రదించారు. ఆదివారం రాత్రే తమతో మాట్లాడారని, మదీనాకు వెళ్లాక ఫోన్ చేస్తామని చెప్పారని జిర్రాకు చెందిన మునీర్ తెలిపారు. ఘటన గురించి పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, జెడ్డాలోని భారత రాయబార కార్యాలయం అధికారులను సంప్రదిస్తున్నామని పోలీసులు తెలిపారు.

**మృతులను గుర్తించాకే అంత్యక్రియలు!**

ప్రమాదంలో మరణించిన 45 మందికి అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది మరణించగా.. వారందరికీ సౌదీలోనే అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు మీడియాకు తెలిపారు. బస్సులో భారీగా మంటలు చెలరేగడంతో కొన్ని మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యుల డీఎన్‌ఏతో మృతుల డీఎన్‌ఏను పోల్చడం ద్వారా గుర్తించే అవకాశం ఉంది. జెడ్డాలోని భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికారులు.. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారు. కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు మృతదేహాలను భారత్‌కు పంపించడం లేదా వారు అంగీకరిస్తే స్థానిక ఆచారాల ప్రకారం మదీనాలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తామని సమాచారమిచ్చినట్లు తెలిసింది.

**మెరాజ్ కాలనీలో విషాదఛాయలు**

టోలీచౌకీ మెరాజ్ కాలనీకి చెందిన రయిస్‌బేగం, ఆమె ఇద్దరు కుమారులు మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. ఆమె పెద్దకుమారుడు మహ్మద్ సైఫ్‌ఉర్ రెహ్మాన్ పదేళ్లుగా దుబాయ్‌లో ఉంటున్నారు. చిన్నకుమారుడు మహ్మద్ షోయబ్ ఉర్ రెహ్మాన్ హైదరాబాద్‌లోనే ఉద్యోగం చేస్తున్నారు. రయిస్‌బేగం, షోయబ్ హైదరాబాద్ నుంచి ఉమ్రాకు బయలుదేరగా దుబాయ్‌లో ఉండే పెద్ద కుమారుడు సైఫ్ ఉర్ రెహ్మాన్ అక్కడి నుంచి ఉమ్రాకు వెళ్లారు. ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు.

**ఒంటరిగా పంపలేక.. బంధువు తోడుగా...**

అల్లాపూర్ డివిజన్ పద్మావతినగర్‌కు చెందిన రహమతున్నీసా బేగం ఈనెల 9న ఉమ్రా యాత్రకు బయలుదేరారు. 12 ఏళ్ల క్రితం భర్త మృతి చెందడంతో కుమారులతో కలిసి నివసిస్తున్నారు. ఉమ్రా యాత్రకు ఒంటరిగా పంపలేక ఆమె కుమారులు సమీప బంధువైన బీదర్‌లో నివసించే రహమత్ బీని తోడుగా పంపారు. సోమవారం సౌదీలో జరిగిన బస్సు ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు.

# తొలుత 'పంచాయతీ పోరు'

- మొదటి పేజి తరువాయి

బీసీలకు 42% రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో కృషి

మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. "స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి గవర్నర్‌కు పంపితే అక్కడే ఆగిపోయింది. ఆర్డినెన్స్ తీసుకువస్తే హైకోర్టు స్టే విధించింది. సుప్రీంకోర్టుకు వెళ్తే... అక్కడ డిస్మిస్ అయింది. చిత్తశుద్ధితో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని ప్రయత్నం చేసినా కేంద్రం సహకారం లేదు. కోర్టుల్లోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్ణయం వచ్చింది. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోతే.. నిబంధనల ప్రకారం 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.3 వేల కోట్ల నిధులు వచ్చే మార్చితో మురిగిపోయే పరిస్థితి ఉంది. దీంతోపాటు గ్రామాల్లో పాలన వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతున్న నేపథ్యంలో.. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. డిసెంబరులోనే పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను క్యాబినెట్ ఆదేశించింది.

ఇప్పుడు ఎన్నికలకు వెళ్లాలంటే.. 50% మించకుండా రిజర్వేషన్ల జాబితాను మరోసారి డెడికేటెడ్ కమిషన్ నుంచి తెప్పించుకోవాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల సంఖ్యపై డెడికేటెడ్ కమిషన్ నుంచి నివేదిక కోరాలని మంత్రివర్గం తీర్మానించింది. వారం రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి... క్యాబినెట్ ఆమోదం పొందాలని సూచించింది. బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో తీర్పులు కొలిక్కి వచ్చిన తర్వాతే... ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని క్యాబినెట్ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన తర్వాత నిర్ణయించాం. రాష్ట్రానికి రావాల్సిన రూ.3 వేల కోట్లు వదులుకోవడం ఇష్టం లేక పంచాయతీ ఎన్నికలు మాత్రమే పెట్టాలని తీర్మానించాం.

మరికొన్ని నిర్ణయాలు

తెలంగాణ సాధించుకున్న పదేళ్లలో రాష్ట్రానికి ప్రత్యేక అధికారిక గీతం లేకపోతే.. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నాం. ఆ రుణాన్ని ఉడతాభక్తిగా తీర్చుకోవాలని ఆయన కుమారుడు దత్తసాయికి డిగ్రీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం ఇవ్వాలని క్యాబినెట్ తీర్మానించింది. 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని ప్రతి పాఠ్యపుస్తకం మొదటి పేజీలో ముద్రించాలని నిర్ణయించాం. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ పాత్ర గురించి భావితరాలకు తెలియజేసేలా.. రాష్ట్రంలో అందెశ్రీ స్మృతివనం ఏర్పాటుకు నిర్ణయించాం.

ఎస్ఆర్ఎస్పీ ఫేజ్-2 ప్రధాన కాలువకు దివంగత నేత రాంరెడ్డి దామోదరరెడ్డి పేరు పెట్టాలని తీర్మానించాం.

ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలను బయటికి తరలించాలని గతంలోనే నోటీసులు ఇచ్చాం. ఆ భూములను 'మల్టీ యూజ్ జోన్లు'గా వినియోగించుకోవాలని నిర్ణయించాం. వాటికి ఎదురుగా ఉన్న రోడ్డు వెడల్పును బట్టి రాష్ట్ర ప్రభుత్వానికి రుసుం కట్టాలి. ఇందుకోసం హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

డిసెంబరు 7 నాటికి ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తోంది. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 8, 9 తేదీల్లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047' ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. రెండేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను 8న సమిట్ వేదికగా వివరిస్తాం. అందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని అధికారులను క్యాబినెట్ ఆదేశించింది.

వచ్చే నెల 9న 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనిక పత్రం (విజన్ డాక్యుమెంట్) విడుదల చేస్తాం" అని పేర్కొన్నారు.

**సౌదీకి మృతుల కుటుంబసభ్యులను తీసుకెళతాం**

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. "సౌదీలో జరిగిన ప్రమాదంలో చనిపోయినవారి ఇళ్లకు వెళ్లి... కుటుంబ సభ్యులతో మాట్లాడాం. పవిత్ర స్థలం అయినందున మక్కాలోనే అంత్యక్రియలు చేయాలని వారు కోరుతున్నారు. అక్కడి భారత ఎంబసీ అధికారులతో మాట్లాడాం. మృతులు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం, సౌదీ ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవడానికి.. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనారిటీ విభాగానికి చెందిన ఒక అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని క్యాబినెట్ నిర్ణయించింది. మృతుల కుటుంబాల నుంచి ఇద్దరిని చొప్పున రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులతో పంపాలని నిర్ణయించాం. వారికి సౌదీ అరేబియా వీసాల కోసం ప్రయత్నాలు చేస్తున్నాం" అని తెలిపారు.

# స్పీకర్ వైఖరి కోర్టు ధిక్కారమే

- మొదటి పేజి తరువాయి

తేదీలోపు ఆ పిటిషన్లపై చర్యలు తీసుకుంటే సరే.. లేదంటే కోర్టు ధిక్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇందులో స్పీకర్ రాజ్యాంగ రక్షణను అనుభవించలేరని తాము ఇదివరకే చెప్పామని, అందువల్ల కొత్త సంవత్సరం ఎక్కడ జరుపుకోవాలనుకుంటున్నారో నిర్ణయించుకొనే స్వేచ్ఛను ఆయనకే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు.

మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని, అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోనందున నేరుగా సుప్రీంకోర్టే దానిపై విచారణ చేపట్టాలని కోరుతూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలుచేసిన రెండు వేర్వేరు పిటిషన్లు.. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం వెలువరించడానికి స్పీకర్‌కు మరో 8 వారాల గడువు ఇవ్వాలని అసెంబ్లీ కార్యదర్శి దాఖలుచేసిన పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ మూడు పిటిషన్లలో ప్రతివాదులకు నోటీసులు జారీచేసి, 4 వారాల్లో సమాధానం చెప్పాలని నిర్దేశిస్తూ విచారణ వాయిదా వేసింది.'స్పీకర్ వైఖరి పూర్తిగా కోర్టు ధిక్కరణలా కనిపిస్తోంది. 10 పిటిషన్లలో ఇప్పటికే నాలుగింటిపై విచారణ పూర్తిచేసి ఉంటే నిర్ణయం వెలువరించి ఉండాల్సింది. ఈ పిటిషన్లపై రోజువారీగా విచారణ జరపాలని మేం ఇదివరకే ఆదేశించాం' అని సీజేఐ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అందుకు అసెంబ్లీ కార్యదర్శి తరఫు న్యాయవాదులు బదులిస్తూ ఇప్పటివరకు చోటుచేసుకున్న పరిణామాలకు సంబంధించిన ఛార్ట్‌ను చూపడానికి ప్రయత్నించగా సీజేఐ 'సారీ' అంటూ వాటిని పరిశీలించడానికి నిరాకరించారు.కేటీఆర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అరియామా సుందరం జోక్యం చేసుకుంటూ.. 'స్పీకర్ నలుగురు ఎమ్మెల్యేలకు సంబంధించిన పిటిషన్లపై విచారణ పూర్తిచేసి మూడు వారాల క్రితమే తీర్పు రిజర్వ్ చేశారు. మరో నాలుగింటిపై ఎవిడెన్స్ నమోదు పూర్తిచేసినా వాదనలు వినిపించడానికి తదుపరి తేదీ ఇవ్వడం లేదు. మరో రెండింటిలో కనీసం కౌంటర్ అఫిడవిట్ కూడా దాఖలు చేయలేదు. ఈ పిటిషన్ల విషయంలో నిర్ణీత గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే తాము ప్రతికూల నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని ధర్మాసనం ఇదివరకే తన తీర్పులో పేర్కొంది. ఈ కేసుల విచారణ పూర్తిచేసే ఉద్దేశం స్పీకర్‌కు లేనందున నోటీసులు జారీచేయాలి. స్పీకర్ తీసుకునే నిర్ణయంపై మరోసారి న్యాయపోరాటం చేయాల్సివస్తే.. అప్పటికల్లా తదుపరి ఎన్నికలు వచ్చేస్తాయి' అని పేర్కొన్నారు. ఆ సమయంలో అసెంబ్లీ కార్యదర్శి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ జోక్యం చేసుకుంటూ తాము 8 వారాల సమయం మాత్రమే కోరుతున్నట్లు ధర్మాసనానికి విన్నవించారు.

**రెండు వారాలా, మూడు వారాలా ఎంత సమయం కావాలి**

అందుకు జస్టిస్ గవాయ్ స్పందిస్తూ 'సమయం అవసరం లేదు. మీరు రోజువారీ విచారణ చేపట్టండి, ఒకవేళ ఎమ్మెల్యేలు అందుకు సహకరించకపోతే దాన్ని ప్రతికూలంగా పరిగణిస్తామని ఇదివరకే చెప్పాం కదా' అని పేర్కొన్నారు. సింఘ్వీ జవాబిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పిటిషన్లపై స్పీకర్ రోజువారీ విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. మధ్యలో వరదలు రావడంతో పది రోజుల గ్యాప్ వచ్చిందన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న సీజేఐ.. మూడు పిటిషన్లలో నోటీసులు జారీచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అయితే వాటికి సమాధానం చెప్పడానికి 'మీకు రెండు వారాలా, మూడు వారాలా ఎంత సమయం కావాలి' అని అడగ్గా.. స్పీకర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకుంటూ 'నాలుగు వారాలు ఇవ్వండి. ఆలోపు అంతా పూర్తిచేస్తాం' అని బదులిచ్చారు. అందుకు సీజేఐ అంగీకరించారు. 'ఆలోపు చేయకపోతే.. తర్వాత మేమేమీ చేయలేం. ఇలాంటి కేసులో స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకున్న సందర్భాలున్నాయి' అని గుర్తుచేశారు. అందుకు రోహత్గీ అంగీకరిస్తూ.. కోర్టు అభిప్రాయాన్ని తాము స్పీకర్‌కు చేరవేస్తామన్నారు. తర్వాత అభిషేక్ సింఘ్వీ జోక్యం చేసుకుంటూ 8 వారాల గడువిచ్చి తదుపరి విచారణను జనవరికి వాయిదావేస్తే ఆలోపు అన్నింటిపైనా నిర్ణయం వెలువరిస్తారని కోర్టుకు విన్నవించారు. ఆ వాదనతో విభేదించిన సీజేఐ.. నోటీసులపై 2 వారాల్లోపు సమాధానం దాఖలు చేయాలని తొలుత ఆదేశించారు. 'తన ముందున్న పిటిషన్లపై స్పీకర్ తానే నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నారా.. లేదంటే ఆయన నిర్ణయం ధిక్కరణ కిందికి వస్తుందా.. లేదా.. అన్నది ఈ కోర్టు నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నారా' అని ప్రశ్నించారు. ఇది పూర్తిగా కోర్టు ధిక్కరణ కిందికి వస్తుందని కూడా పేర్కొన్నారు. స్పీకర్ గత ప్రవర్తనే తాము ఈ వ్యాఖ్యలు చేయడానికి పురిగొల్పిందన్నారు. అప్పట్లో కూడా కోర్టులో పిటిషన్ దాఖలైన తర్వాతే స్పీకర్ నోటీసులు జారీచేసినట్లు గుర్తుచేశారు.అందుకు ముకుల్ రోహత్గీ స్పందిస్తూ 4 వారాల సమయం ఇవ్వాలని, కోర్టు వ్యక్తంచేసిన అభిప్రాయాలను స్పీకర్ దృష్టికి తీసుకెళ్తామని విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ తరఫు న్యాయవాది సుందరం రెండు వారాల గడువు మాత్రమే ఇవ్వాలని కోరారు. సీజేఐ స్పందిస్తూ 'నాలుగు వారాల గడువిచ్చి చూద్దాం. ఆలోపు పిటిషన్లపై చర్యలు తీసుకుంటే సరే. లేదంటే కోర్టు ధిక్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

## షేక్ హసీనాకు మరణశిక్ష...

## ట్రైబ్యునల్ సంచలన తీర్పు

- మొదటి పేజి తరువాయి

మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారన్న అభియోగాల నేపథ్యంలో ఆమెపై పలు కేసులు నమోదయ్యాయి. వాదనలు విన్న ట్రైబ్యునల్ ఆమెను దోషిగా తేల్చింది. అనంతరం ఆమెకు మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. గత సంవత్సరం రిజర్వేషన్ల కోసం జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారి అవామీ లీగ్ గద్దె దిగడానికి కారణమైంది. ఆందోళనకారుల బారి నుంచి తప్పించుకోవడానికి షేక్ హసీనా ప్రత్యేక విమానంలో భారత్‌కు వచ్చారు. ఏడాదికి పైగా ఆమె ఢిల్లీలోని గుర్తు తెలియని ప్రాంతంలో తలదాచుకుంటున్నారు. ఇలాంటి సమయంలో ఆమెకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించింది. తనపై జరిగిన సుదీర్ఘ విచారణను ఇటీవల షేక్ హసీనా న్యాయశాస్త్రంలో ఒక జోక్‌గా అభివర్ణించారు. షేక్ హసీనా పాలన ముగిసి, తాత్కాలిక యూనస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో రాజకీయ గందరగోళం నెలకొంది. 2026 ఫిబ్రవరిలో సాధారణ ఎన్నికలు జరగాల్సి ఉన్న తరుణంలో రాజకీయంగా అస్థిరత నెలకొంది.

## ఉగ్రవాదులకు మద్దతు కొనసాగిస్తే.. తీవ్ర పరిణామాలు

- మొదటి పేజి తరువాయి

స్తుందని.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో వ్యవహరించే విషయంలో భారత ప్రభుత్వం కొత్త విధానాలను అనుసరిస్తున్నట్లు తెలిపారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్న ఉగ్రవాద గ్రూపులకు మద్దతును కొనసాగిస్తే పాక్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉగ్రవాద మూలాలను ఎగదోయడం మానుకోకుంటే ఆ దేశ అస్థిత్వమే ప్రమాదంలో పడుతుందన్నారు.

భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల పురోగతి, శ్రేయస్సుపై దృష్టి పెడుతుందని.. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, దీటుగా స్పందిస్తుందని జనరల్ ద్వివేది అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాల ఉనికి గురించి ప్రపంచానికి ఆధారాలు అందించామన్నారు. చర్చలు, ఉగ్రవాదం ఎన్నటికీ కలిసి సాగవని.. రక్తం, నీరు కలిసి ప్రవహించబోవని పాక్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. ప్రస్తుతం బ్లాక్‌మెయిళ్లకు భయపడే స్థితిలో భారత్ లేదని.. శత్రువులను ఎదుర్కోవడానికి దేశంలోని నేతలంతా ఒక్కతాటిపై పని చేస్తున్నారన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితి మెరుగుపడిందన్నారు.

ఇంతకు ముందుతో పోల్చితే పొరుగు దేశమైన చైనాతో భారత్ సంబంధాలు బలపడుతున్నాయని ద్వివేది పేర్కొన్నారు. సరిహద్దుల నిర్వహణపై తాజాగా ఇరుదేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరిగినట్లు తెలిపారు. సైనిక, దౌత్య మార్గాల్లో లోతైన చర్చలు జరిపేందుకు.. భారత్- చైనా సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత పరిస్థితులు కొనసాగించేందుకు ఇరుదేశాలు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

'ఐబొమ్మ' రవి వద్ద 50 లక్షల మంది డేటా ఉంది..

## రూ. 20 కోట్లు సంపాదించాడు

- మొదటి పేజి తరువాయి

సైబర్ క్రైమ్ పోలీసులను వారు అభినందించారు.ఈ భేటీ అనంతరం సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.. పైరసీ దేశవ్యాప్తంగా సినీ పరిశ్రమను దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రధాన సూత్రధారి ఇమ్మడి రవిని ఎట్టకేలకు అరెస్ట్ చేశాం. బాలీవుడ్, టాలీవుడ్‌కు చెందిన వేలాది సినిమాలను ఇతను పైరసీ చేశాడు. పైరసీ ద్వారా సుమారు రూ.20 కోట్లు సంపాదించినట్లు ఒప్పుకున్నాడు. అతని నుంచి రూ.3 కోట్లు స్వాధీనం చేసుకున్నాం" అని తెలిపారు.రవి వద్ద సుమారు 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా ఉందని, ఈ డేటాను దుర్వినియోగం చేసే ప్రమాదం కూడా ఉందని సజ్జనార్ హెచ్చరించారు. పైరసీ వెబ్‌సైట్ల ముసుగులో బెట్టింగ్ యాప్‌లను కూడా ప్రమోట్ చేశారని, దీనివల్ల ఎంతో మంది యువకులు ప్రాణాలు తీసుకుని తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారని అన్నారు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే మరోదాన్ని సృష్టిస్తూ.. రవి మొత్తం 65 మిర్రర్ వెబ్‌సైట్లను నడిపినట్లు గుర్తించారు.ఇమ్మడి రవికి ముందు నుంచే నేర చరిత్ర ఉందని, మహారాష్ట్రలో ప్రహ్లాద్ పేరుతో నకిలీ డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్ సృష్టించాడని సజ్జనార్ తెలిపారు. కరేబియన్ దీవుల్లో పౌరసత్వం కూడా తీసుకున్నాడని, అమెరికా, నెదర్లాండ్స్‌లో సర్వర్లు ఏర్పాటు చేసి ఈ పైరసీ సామ్రాజ్యాన్ని నడిపాడని వివరించారు. ఈ కేసులో గతంలోనే దుద్దెల శివరాజ్, ప్రశాంత్ అనే ఇద్దరిని అరెస్ట్ చేశామని, రవిపై ఐటీ, కాపీరైట్ చట్టాల కింద మొత్తం 5 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## ఆటో డ్రైవర్లకు బీమా చెల్లిస్తా

- మొదటి పేజి తరువాయి

భారాస హయాంలో అసంఘటిత రంగంలోని డ్రైవర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేసిందని గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల సాయం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. ప్రస్తుతం రూ.24 వేలు బాకీ ఉందన్నారు. జిల్లాలోని 5 వేల మంది ఆటో డ్రైవర్లకు వ్యక్తిగతంగా తాను బీమా చెల్లిస్తానని కేటీఆర్ ప్రకటించారు. వివరాలను బుధవారం సాయంత్రంలోగా తనకు అందజేయాలని వారికి సూచించారు. జాబితా అందిన మూడు, నాలుగు రోజుల్లోనే చెక్కులు పంపిస్తానని హామీ ఇచ్చారు.

## ప్రాజెక్టుల పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

- మొదటి పేజి తరువాయి

గాను సవరించిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘానికి సమర్పించాం. 45 టీఎంసీలు గోదావరి జలాల మళ్లింపు, మైనర్ ఇరిగేషన్‌లో పొదుపు 45 టీఎంసీలుగా పేర్కొన్నాం. మొదటి దశలో మైనర్ ఇరిగేషన్‌లో పొదుపు కింద ఉన్న 45 టీఎంసీలకు అనుమతులిచ్చేలా చూడగలరు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి సీడబ్ల్యూసీలోని ఇరిగేషన్ ప్లానింగ్ డైరెక్టరేట్ అభ్యంతరాలను నివృత్తి చేశాం. అనుమతులివ్వాల్సి ఉంది. కృష్ణా బేసిన్‌లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయాలి. తెలంగాణ, ఏపీల మధ్య కృష్ణాజలాల పునః పంపిణీపై ట్రైబ్యునల్-2 విచారణను వీలైనంత త్వరగా పూర్తిచేసేలా కేంద్రం చొరవ చూపాలి. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి ఏపీ టెండర్లు పిలిచి రద్దు చేసింది. అయితే, మరొక పేరుతో ఈ ప్రాజెక్టును చేపట్టే అవకాశాలున్నాయి. వరద జలాల మళ్లింపునకు ఈ లింక్ ప్రాజెక్టు చేపడుతుండటంతో ఎగువ రాష్ట్రాలు వాటాలను గుర్తుచేస్తున్నాయి. ఎగువ రాష్ట్రాలు నీటి మళ్లింపునకు పాల్పడితే దిగువన తెలంగాణకు నష్టం జరుగుతుంది. ఈ లింక్ ప్రాజెక్టును ప్రతిపాదిత ప్రాంతం నుంచి కాకుండా మరోచోట నుంచి చేపట్టేందుకు ఏపీ ప్రయత్నించొచ్చు. దాన్ని నిలువరించాల్సిన అవసరం ఉంది. ఆలమట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపుపై సుప్రీంకోర్టులో స్టే ఉత్తర్వులు ఉన్నప్పటికీ కర్ణాటక 524.25 మీటర్లకు నిర్మించేందుకు ప్రయత్నిస్తోంది. ఆ రాష్ట్రం ముందుకు వెళ్లకుండా కట్టడి చేయాలి. ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన- సాగునీటి సత్వర ప్రయోజన కార్యక్రమం కింద రాష్ట్రంలో గిరిజన ప్రాంతాలు, కరవుపీడిత ప్రాంతాల్లోని ఏడు ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కేంద్రం తోడ్పాటునందించాలి. ప్రాణహిత-చేవెళ్ల, నారాయణపేట-కొడంగల్, సమీకృత సీతారామ-సీతమ్మసాగర్, పాలమూరు-రంగారెడ్డి, చిన్నకాళేశ్వరం, మోడికుంటవాగు, చనాఖ-కోర్టా(కాలువలు) ప్రాజెక్టులపై కావాల్సిన ఆర్థిక సహాయంపై గత నెల 15న కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం. వెంటనే కేంద్రం దృష్టి సారించాలి" అని ఉత్తమ్ లేఖలో కోరారు.

# ఓట్ చోరీ తోనే బీజేపీ గెలుపు...


- ఓట్ చోరికి వ్యతిరేకంగా గాంధీ భవన్ లో మహా నిరసన...
- పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్న భద్రాద్రి ఐవైసి జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్...




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 17,**తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓట్ చోరికి వ్యతిరేకంగా గాంధీ భవన్ లో మహా నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ భాను చిబ్, రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ ఇతర ముఖ్య నేతలు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ నాయకత్వంలో దేశం ప్రమాదంలో ఉందని, దేశవ్యాప్తంగా ఎలక్షన్ కమిషన్, కేంద్ర ప్రభుత్వం కలిసి ఓట్లు చోరీ చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వివిధ మాధ్యమాల ద్వారా ఈ బాగోతాన్ని ఎండగడుతున్నారని, ఆయన పోరాటానికి మద్దతుగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటం చేసేందుకు భద్రాద్రి జిల్లా యువజన కాంగ్రెస్ శ్రేణులు విస్తృతం ప్రచారం చేసి తెలంగాణలో సర్ పేరిట ఓట్లు తొలగించే ప్రమాదం రాకుండా అడ్డుకోవాలన్నారు. గులాం మతిన్, రామ్మూర్తి,సదా, అశోక్ బబ్లు, పినపాక అసెంబ్లీ ప్రెసిడెంట్ తరుణ్ రెడ్డి, మండల ప్రెసిడెంట్ శ్రీకాంత్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ మౌనిష్ గౌడ్, భద్రాచలం వైస్ ప్రెసిడెంట్ గాడి విజయ్, అశ్వరావుపేట వైస్ ప్రెసిడెంట్ కిషోర్, చైతన్య నాయుడు, కరుణ్ రెడ్డి, మరియు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భీమిలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న జిల్లా నాయకులు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి పార్టీ జిల్లా నాయకులు మంద నరసింహ ముదిరాజ్.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 16** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని సంఘం గ్రామంలో శ్రీ భీమలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు సమక్షంలో ఘనంగా నిర్వహించినారు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి పార్టీ జిల్లా నాయకులు మంద నరసింహ ముదిరాజ్ భగవంతుని ఆశీస్సులు తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించినారు మీడియాతో మాట్లాడుతూ సంఘం గ్రామ ప్రజలకు మండల ప్రజలకు భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని అన్నారు ఈ కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించిన గ్రామ పెద్దలకు గ్రామ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపినారు.

## పత్తి రైతులు రేపు పత్తి తీసుకురావద్దు.

**జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 17,**జిల్లాలోని పత్తి రైతు సోదరులకు ముఖ్యమైన సమాచారం అందిస్తూ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు, రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల సంఘం పిలుపు మేరకు రేపు తేదీ 18-11-2025 న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిన్నింగ్ మిల్లులు బంద్‌లో పాల్గొననున్నాయి. అందువల్ల పత్తి రైతులు రేపు తమ పత్తిని సెంట్రల్ కాటన్ కార్పొరేషన్ ( సీ సి ఐ ) వారికి అమ్ముకొనుట కోసం పత్తిని తీసుకువెళ్లకూడదని ఆయన సూచించారు.
రేపు సిసిఐ సీఎండీతో రాష్ట్ర జిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ ప్రతినిధుల మధ్య ముఖ్యమైన చర్చలు జరగనున్నాయని, ఈ చర్చల అనంతరం పరిస్థితులపై స్పష్టత వచ్చిన తరువాతే పత్తి కొనుగోలు ప్రక్రియపై తదుపరి సూచనలు జారీ చేయబడతాయని నరేందర్ వివరించారు.

## కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు...



- పలు అంశాలపై విద్యార్థులకు వ కృత్వ పోటీలు...

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 17,**జిల్లా కేంద్ర గ్రంథాలయం భద్రాద్రి కొత్తగూడెం నందు 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నాలుగవ రోజు కూడా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పి స్వప్న మహిళా కళాశాల తెలుగు అధ్యాపకురాలు వివిధ పాఠశాలకు సంబంధించిన విద్యార్థిని విద్యార్థుల కు పోటీని నిర్వర్తించడం అయినది ఈ కార్యక్రమంలో జూనియర్స్ విభాగంలో
అంశము:- చరవాణి ఉపయోగాలు నష్టాలు, సీనియర్స్ విభాగం అంశం:- మత్తు పదార్థాల వినియోగం వలన జరుగు నష్టాలు, అనే అంశాల పైన వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు మాట్లాడారు ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు జీ మణి మృదుల గ్రంథ పాలకుడు మధుబాబు, వాణి గ్రంథాలయ సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు

## సంఘం గ్రామంలో శ్రీ భీమిలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు.

జిజేఆర్ రాష్ట్రయువసేన అధ్యక్షులు కీసరి కిరణ్ రెడ్డి.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 16 :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని సంఘం గ్రామంలో శ్రీ భీమలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు సమక్షంలో ఘనంగా నిర్వహించినారు.
కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన జిజేఆర్ రాష్ట్ర యువసేన అధ్యక్షులు కీసర కిరణ్ రెడ్డి భగవంతుని ఆశీస్సులు తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించినారు.
మీడియాతో మాట్లాడుతూ సంఘం గ్రామ ప్రజలకు మండల ప్రజలకు భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరినారు.
ఈ కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించిన గ్రామ పెద్దలకు గ్రామ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపినారు.

## ప్రతీగింజనూ కొనుగోలు చేసేవిధంగా ఏర్పాట్లు చేసుకోవాలి...

- దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోవద్దు...
- రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి...
- చాతకొండలో ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని....



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం/ లక్ష్మీదేవిపల్లి జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), నవంబర్17,**
రైతులు పండించిన ప్రతిగింజనూ కొనుగోలు చేసే విధంగా అధికారులు ఏర్పాటు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించినా సహించేదిలేదని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కొత్తగూడెం ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని 'సోమవారం అయన ప్రారంభించారు. అనంతరం జరిగిన రైతు సభలో కూనంనేని మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించకుండా, నాణ్యతా ప్రమాణాల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా, తరుగు పేరుతో కోత విధించకుండా సత్వరమే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి లో కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఏమైనా సమస్యలు తలెత్తితే, తమ దృష్టికి తీసుకురావాలని, తక్షణమే పరిష్కరించడాని కి కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ముఖ్యంగా, కొనుగోలు చేసిన ధాన్యం యొక్క బస్తాలను తరలించడంలో ఆలస్యం జరగకుండా, ఎప్పటికప్పుడు మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు చెల్లించాల్సిన నగదును కూడా త్వరగా వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. టార్పాలిన్లు, తూకాల పరికరాలు, తగిన బస్తాల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఈ నూతన కేంద్రం ఏర్పాటుతో చాతకొండ, పరిసర గ్రామాలకు చెందిన రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి దూరం వెళ్లాల్సిన అవసరం తప్పిందని, దీనివల్ల వారికి సమయం, రవాణా ఖర్చులు ఆదా అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మండే హన్మంతరావు, ఉపాధ్యక్షులు కూచుపుడి జగన్, డైరెక్టర్ చంద్రగిరి శ్రీనివాసరావు, తహసీల్దార్ శిరీష, ఎంపిడివో అంకుబాబు, ఎంపివో శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖా ఏఈ రాకేష్, సివిల్ సప్లై డీటీ మహేష్, విద్యుత్ శాఖా ఏఈ రఘురామయ్య, హౌసింగ్ ఏఈ దేవిడ్, ఆర్ఐ శివకృష్ణ, సిపిఐ నాయకులు దీటి లక్ష్మీపతి, నూనావత్ గోవిందు, మంద గ్రాబ్రియల్, కోడి లింగయ్య, వర్స లక్ష్మయ్య, మాధవరావు, మంకెన ప్రసాద్, క్రాంతిభూషణ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## తాళ్లూరి వెంకయ్యకి నివాళులర్పించిన చింతకాని మండల కాంగ్రెస్ నాయకులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**
మండల పరిధిలోని జగన్నాధపురం. గ్రామానికి చెందిన తాళ్లూరి వెంకయ్య. పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి అకాల మరణం పట్ల చింతకాని మండల కాంగ్రెస్ కమిటీ పక్షాన సంతాపం తెలియజేస్తూ.. వారి ప్రవిత ఆత్మకు శాంతి కలగాలని, కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన మండల కాంగ్రెస్ నాయకులు.
ఈ కార్యక్రమంలో... మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ %డ% మండల కాంగ్రెస్ పార్టీ అంబటి వెంకటేశ్వరరావు, మత్కేపల్లి మార్కెట్ డైరెక్టర్ బందెల నాగార్జున, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు కొప్పుల గోవిందరావు, నాగులవంచ గ్రామ శాఖ అధ్యక్షులు కంభం వీరభద్రం, సిపిఎం నాయకులు గడ్డం రమణ, సొసైటీ డైరెక్టర్ వలమల్ల రామారావు, మత్కేపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కంచం కోటేశ్వరావు,జగన్నాధపురం కాంగ్రెస్ నాయకులు తదితరులు నివాళులర్పించారు.

## ఇందిరాపార్క్ ధర్నాలో పాల్గొన్న మండల పెన్సిలర్ సంఘం నాయకులు .




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** మార్చి 2024 తర్వాత రిటైర్మెంట్ అయినటువంటి ఉద్యోగ ,ఉపాధ్యాయ సంఘాల పెన్షనర్లు రాష్ట్ర సంఘం పిలుపుమేరకు సోమవారం హైదరాబాద్
ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి మండల పెన్సిలర్ సంఘం నాయకులు హైదరాబాద్ వెళ్ళినారు. తమకు న్యాయంగా రావలసినటువంటి రిటైర్మెంట్ బకాయిలు ప్రభుత్వం వెంటనే ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని వారు విమర్శించారు .గత 20 నెలలుగా రిటైర్మెంట్ అయినప్పటికీ ఏ ఒక్క ఉద్యోగికి కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదని, అనేకమంది ఆర్థిక ఇబ్బందులతో రాష్ట్రంలో 30 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా పెన్షనర్ సంఘం బాధ్యులు అంబటి శాంతయ్య, కంచుమర్తి పుల్లయ్య ,మండల సంఘంబాధ్యులుమధుసూదన్,రెడ్డి,రాంచంద్రావు ,మాధవరావు, ఆదినారాయణ, రెహముద్దీన్,మస్తాన్,వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.ద

## సంఘంలో ఘనంగా శ్రీ భీమిలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి పార్టీ జిల్లా నాయకులు కందుల తానేష్ గౌడ్.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 16** : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని సంఘం గ్రామంలో శ్రీ భీమలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు సమక్షంలో ఘనంగా నిర్వహించినారు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి పార్టీ జిల్లా నాయకులు కందుల తానేష్ గౌడ్ భగవంతుని ఆశీస్సులు తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించినారు మీడియాతో మాట్లాడుతూ సంఘం గ్రామ ప్రజలకు మండల ప్రజలకు భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ప్రతి వ్యక్తి సేవ చేసే గుణం కలిగి ఉండాలని ఈ కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించిన గ్రామ పెద్దలకు గ్రామ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపినారు.

# సుంకి శాలలో అంగరంగ వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం.

- కళ్యాణ వేడుకలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆత్మకూరు మాజీ ఎంపీపీ తండా శ్రీశైలం మంగమ్మ.







**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 18,**యాదాద్రి భువనగిరి జిల్లావలిగొండ మండలం సుంకిశాల గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి 28వ బ్రహ్మోత్సవాలు సందర్భంగా డాక్టర్ పైళ్ళ మల్లారెడ్డి సాధన యూఎస్ఏ వారి ఆధ్వర్యంలో,సోమవారం మధ్యాహ్నం 12 గంటలకుశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా యాదగిరిగుట్ట ప్రధాన అర్చకులు కారంపొడి నరసింహ చార్యులు అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు, పైళ్ల మల్లారెడ్డి కుటుంబ సభ్యులు మరియు అన్నప్రసాద కార్యక్రమం పైళ్ళసంజీవరెడ్డి,మనోరమ్మ, కుటుంబ సభ్యులు నిర్వహించారు,ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అర్చకులు గ్రామ ప్రజలు మహిళలు మండల ప్రజలు తదితరులు

# సంఘంలో ఘనంగా శ్రీ భీమిలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు.

- ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామ పెద్దలు.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 16** :

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని సంఘం గ్రామంలో శ్రీ భీమలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు సమక్షంలో ఘనంగా నిర్వహించినారు.కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన స్థానిక ఎమ్మెల్యే కుంభ%శీ% అనిల్ కుమార్ రెడ్డి. భగవంతుని ఆశీస్సులు తీసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినారు.

మీడియాతో మాట్లాడుతూ సంఘం గ్రామ ప్రజలకు మండల ప్రజలకు భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ప్రతి వ్యక్తి సేవ చేసే గుణం కలిగి ఉండాలని ఈ కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించిన గ్రామ పెద్దలకు గ్రామ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జంగారెడ్డి కీసరి రాంరెడ్డి కాసుల కృష్ణ జిజేఆర్ రాష్ట్ర యువసేన అధ్యక్షులు కీసరి కిరణ్ రెడ్డి కందుల తానేష్ గౌడ్ బద్దం సంజీవరెడ్డి మంద నరసింహ ముదిరాజ్ బాతరాజు బాలనరసింహ సుర కంటి వెంకట్ రెడ్డి బద్దం రాఘవేందర్ రెడ్డి వరికుప్పల మల్లేశం ఉండాడి సత్యనారాయణ సురకంటి మురళీధర్ రెడ్డి కీసరి మల్లారెడ్డి పొన్నాల వాసుదేవరెడ్డి నోముల మాధవరెడ్డి వెల్దురి గిరిధరాచారి జక్కుల వెంకటేశం కేసాని నరేష్ కాట పెల్లి బాల మల్లేశం కీసరి వెంకటరెడ్డి వరికుప్పల నరసింహ ఉండాడి రామచందర్ మర్యాదగా సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సంఘం గ్రామంలో శ్రీ భీమిలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న జిల్లా నాయకులు.

జిల్లా నాయకులు జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 16** : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని సంఘం గ్రామంలో శ్రీ భీమలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు సమక్షంలో ఘనంగా నిర్వహించినారు.

కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా నాయకులు వరికుప్పల మల్లేశం భగవంతుని ఆశీస్సులు తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించినారు. మీడియాతో మాట్లాడుతూ సంఘం గ్రామ ప్రజలకు మండల ప్రజలకు భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరినారు.

ఈ కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించిన గ్రామ పెద్దలకు గ్రామ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపినారు.

# కాంగ్రెస్ హత్య రాజకీయాలకు పాల్పడుతుంది




సామినేని రామారావు హంతకులను వెంటనే అరెస్టు చేయాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ హత్య రాజకీయాలకు పాల్పడుతుందని ఇది ప్రజాస్వామ్యానికే మాయన మచ్చని ఎమ్మెల్సీ కల్వకుంట కవిత అన్నారు. మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు కుటుంబ సభ్యులను కల్వకుంట్ల కవిత సోమవారం రాత్రి పాతర్లపాడులో పరామర్శించారు. రామారావు హత్య జరిగిన తీరును భార్య స్వరాజ్యం కుమారుడు విజయకుమార్ ని అడిగి ఆమె తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రామారావు గొప్పతనాన్ని పేద ప్రజల కోసం ఆయన చేసిన సేవలను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామినేని రామారావు చాలా మంచి మనిషి అని గ్రామస్తులందరూ చెబుతున్నారన్నారు. అటువంటి వ్యక్తిని కాంగ్రెస్ నాయకుల పట్టణ పెట్టుకున్నారని ఆరోపించారు. రామారావుని హత్య చేసి 17 రోజుల కడుస్తున్న నేటి వరకు నేరస్తులను ఎందుకు అరెస్టు చేయలేదని ఆమె పోలీసు ఉన్నతాధికారులను ప్రశ్నించారు. డిజిపి వెంటనే ఈ సమస్యపై స్పందించాలని డిమాండ్ చేశారు. రామారావు హత్యపై నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించాలని నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కుటుంబానికి తాను రాష్ట్రస్థాయిలో కూడా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులకు బెదిరించడం భయపెట్టడం అలవాటు అన్నారు. నేరస్తులకు శిక్ష పడాలని ఆమె డిమాండ్ చేశారు. కష్టం వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ ఆ కుటుంబానికి అండగా ఉండాలని అందులో భాగంగానే తాను హైదరాబాదు నుంచి రామారావు కుటుంబానికి అండగా ఉండేందుకు వచ్చానన్నారు. విప్లవాన్ని మోసే వీరులు మీరు, ఎర్రజెండా బిడ్డలు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎర్రజెండా పేద ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. పేద ప్రజల కోసం పనిచేస్తున్న సామినేని రామారావుని హత్య చేయటం దారుణం అన్నారు. టిఆర్ఎస్ నాయకులు సామినేని అప్పారావు సిపిఎం నాయకులు కాటబత్తిని వీరబాబు సీనియర్ నాయకులు కొండ్రు జానకిరామయ్య ఓబినబోయిన అచ్చయ్య కొత్త పెల్లి వెంకటేశ్వర్లు మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులకు మరియు కార్యకర్తలకు విజ్ఞప్తి!

- తాత మధుసూదన్ ఎమ్మెల్సీ
- బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**

పత్తి రైతుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వివక్షతను నిరసిస్తూ రేపు జరిగే ఆందోళనను జయప్రదం చేయండి!

రాష్ట్రవ్యాప్తంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల మీద టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు నేడు అనగా (18/11/2025), మంగళవారం ఉదయం 8 గంటలకు ఖమ్మం పత్తి మార్కెట్లో టిఆర్ఎస్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం జరుగుతుంది.

అకాల వర్షాలతో, అననుకూల వాతావరణ పరిస్థితులతో ఇప్పటికే దిగుబడి రాక అతలాకుతలమవుతున్న పత్తి రైతులను ఆదుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయి. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రాష్ట్రంలో ఏ మార్కెట్లో కూడా అమలు కావడం లేదు. తేమశాతం పేరుతో పత్తి రైతులను వ్యాపారులు, సిసిఐ కుమ్మక్కై నిలువునా దోచుకుంటున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రైతులు పండించిన పత్తిని అన్ని మార్కెట్లలో తేమ శాతంతో సంబంధం లేకుండా తక్షణమే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రేపు ఉదయం 8 గంటలకు ఖమ్మం పత్తి మార్కెట్లో జరిగే ఆందోళన కార్యక్రమంలో మీరు పాల్గొని విజయవంతం చేయాలని మిమ్మల్ని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను.



# ఆగిన గుండె.....

# ఎంత ప్రయత్నించిన దక్కని ప్రాణం" డాక్టర్ భరత్ రెడ్డి....



పెబ్బేరు మండలం వై. శాఖాపూర్ గ్రామానికి చెందిన కే. సాయన్న వయసు డెబ్బై సంవత్సరాలు. మోకాలి నొప్పితో బాధపడుతూ పెబ్బేరు నందు గల సరోజినీ హాస్పిటల్ లో ఈ రోజు అనగా సోమవారం సమయం సరిగ్గా ఉదయం 11:20 నిమిషాలకు హాస్పిటల్ లో అడ్మిట్ అయ్యారు.. అదే రోజు సాయంత్రం 5:23 నిమిషాలకు హాస్పిటల్ లోనే మరణించడం జరిగింది. ఇట్టి విషయం మీద డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి ని వివరణ కోరగా మోకాలి నొప్పి తో బాధపడుతున్న సాయన్న కి ఎల్ఓఎక్స 2% మరియు కిన్స్టోర్ట్ ఇంజక్షన్ వేయడం జరిగినది.. ఇది కేవలం పెయిన్ కిల్లర్ కోసమే ట్రీట్మెంట్ ఇచ్చాము... కొంత సమయం తర్వాత పేషెంట్ కి ఎలర్జీ వస్తుందని చెప్పడం జరిగింది దాని తర్వాత హార్ట్ స్ట్రోక్ వచ్చిందని చెప్పడం తో మేము సిపియార్ చేయడం జరిగింది కానీ దురదృష్టవశాత్తు పేషెంట్ మరణించడం జరిగింది..కానీ అంతకు ముందే ఇలాగ అప్పుడప్పుడు గుండెలో నొప్పి వచ్చేదని పేషెంట్ బంధువులు చెప్పడం జరిగింది.. అని వివరణ ఇచ్చారు. కే. సాయన్న కుమారుడు రవి ని వివరణ కోరగా భరత్ కుమార్ సర్ చాలా ప్రయత్నం చేసిన లాభం లేకపోయిందని ఇందులో డాక్టర్ తప్పేమి లేదని వివరణ ఇస్తూ.. మా పెద్ద మనుషులు మా కుటుంబానికి ఆదుకోవాలని అడగగా డాక్టర్ గారు సానుకూలంగా స్పందించారు.అని తెలిపారు...

# కన్నుల పండువగా ఆకుతోట వారి రిసెప్షన్ వేడుక

ఆత్మీయులు, అతిరథమహారథుల రాకతో రిసెప్షన్ సందడి

**సి కె న్యూస్ ప్రతినిధి**

సీనియర్ జర్నలిస్ట్ , టిజెఎఫ్ జర్నలిస్టు యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, అరుణ దంపతుల ప్రథమ పుత్రుడు అన్వేషణ తో విధిత ల వివాహ వేడుక అంగరంగ వైభవంగా శనివారం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. కాగా అన్వేషణ , విధిత ల రిసెప్షన్ వేడుక ఖమ్మంలోని ఎస్సార్ గార్డెన్స్ లో సోమవారం రాత్రి అట్టహాసంగా జరిగింది.



కనుల పండుగ జరిగిన ఈ వేడుకకు ఖమ్మం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య,మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, కొండ బాల కోటేశ్వరరావు, వార్త రీజినల్ మేనేజర్ జెవి రత్నం దంపతులు, స్తంభాద్రి బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, ప్రముఖ విద్యావేత్త పారుపల్లి ఉషా కిరణ్, రవి మారుత్ ,మాస్ లైన్ రాష్ట్ర నేత పోటు రంగారావు, గ్రానైట్ అసోసియేషన్ నాయకులు పార నాగేశ్వరరావు, ఆకుల గాంధీ,మాజీ సోడా చైర్మన్ బి. విజయ్ కుమార్, జర్నలిస్టులు,వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నేతలు, నగర ప్రముఖులు,

ఆత్మీయులు , అతిరథమహారథులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున తరలివచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# ఎన్ఐఏ కస్టడీకి ఢిల్లీ పేలుడు ఘటన నిందితుడు

**సి కె న్యూస్ ప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీ లోని ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన భారీ పేలుడు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పేలుడుకు పాల్పడిన ఉమర్ కు సహకరించిన నిందితుడు అమీర్ రషీద్ అలీ ని కట్టుదిట్ట మైన భద్రత మధ్య పాటియాలా హౌస్ కోర్టు కాంప్లెక్స్ లోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు ముందు సోమవారం నాడు హాజరు పరిచారు. ఈ మేరకు 10 రోజుల ఎన్ఐఏ కస్టడీకి కోర్టు ఆదేశించింది. ఆ వెంటనే రషీద్ ను ఎన్ఐఏ కార్యాలయానికి అధికారులు తరలించారు.అమీర్ రషీద్ అలీ ని కోర్టుకు హాజరుపరిచే సమయంలో మీడియాను అనుమతించలేదు. కోర్టు కాంప్లెక్స్ చుట్టూ ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది మోహరించారు. అల్లర్ల వ్యతిరేక టీమ్ నూ సిద్ధం చేశారు. నవంబర్ 10 న జరిగిన ఢిల్లీ పేలుడు ఘటనలో 10 మంది మృతి చెందగా, 13 మంది గాయ పడ్డారు. ఐఈడీ అమర్చి పేల్చిన ఐ 20 కారు అమీర్ పేరుతో రిజిస్టర్ కావడంతో ఎన్ఐఏ అతన్ని అదుపు లోకి తీసుకుంది. సూసైడ్ బాంబర్ ఉమర్ నబీతో కలిసి ఈ దాడికి అమీర్ రషీద్ కుట్ర పన్నినట్టు ఎన్ఐఏ వెల్లడించింది. అమీర్ జమ్మూ కశ్మీర్ లోని పంపోర్ కు చెందిన వ్యక్తి కాగా, ఉమర్ ఫరీదాబాద్ లోని అల్-ఫలాహ్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నాడు. తదుపరి విచారణలో భాగంగా ఉమర్ ఉపయోగించిన మరో కారు నూ ఎన్ఐఏ స్వాధీనం చేసుకుంది. ఇంత వరకూ గాయపడిన బాధితులతో సహా 73 మంది సాక్ష్యులను ఎన్ఐఏ విచారించింది. మరో వైపు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్ కేసులో ప్రమేయం, మోసం, ఫోర్జరీకి పాల్పడిన ఆరోపణ లపై అల్-ఫలాహ్ యూనివర్సిటీ చైర్మన్‌కు ఢిల్లీ పోలీసులు రెండు సమన్లు జారీ చేశారు. యూజీసీ, ఎన్ఏఏసీ లేవనెత్తిన ఆందోళన లపై రెండు ఎఫ్ఐఆర్ లనూ నమోదు చేశారు. యూనివర్సిటీ గుర్తింపు క్లెయిమ్స్ పై జరిపిన సమీక్షలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్టూ గుర్తించారు.

# మళ్లీ హరీష్ ను టార్గెట్ చేసిన కవిత

**హైదరాబాద్, నవంబర్ 17,**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గులాబీ పార్టీ ఓడిపోయిన తర్వాత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక ట్వీట్ చేశారు. కర్మ వెంటాడిందని ఆ ట్వీట్ లో ఆమె పేర్కొన్నారు. తద్వారా జూబ్లీహిల్స్ ఓటమి గులాబీ పార్టీకి సరైనగుణపాఠం చెప్పిందని ఒక ముక్కలో తేల్చి పడేశారు.జూబ్లీహిల్స్ ఓటమి బాధలో ఉన్న గులాబీ పార్టీని కల్వకుంట్ల కవిత శనివారం మరింత ఇబ్బంది పెట్టారు.. ప్రస్తుతం ఆమె ఉమ్మడి మెదక్ జిల్లాలో పర్యటిస్తున్నారు.రెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించారు.. ఈ సందర్భంగా కవిత విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మరోసారి మాజీ మంత్రి హరీష్ రావు మీద తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. వాస్తవానికి పార్టీ నుంచి బయటికి వచ్చినతర్వాత కల్వకుంట్ల కవిత ప్రధానంగా హరీష్ రావును లక్ష్యంగా చేసుకొని మాట్లాడుతున్నారు. అవకాశం దొరికిన ప్రతి సందర్భంలోనూ కల్వకుంట్ల కవిత ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. హరీష్ రావును లక్ష్యంగాచేసుకుని ఆమె పకడ్బందీ స్థాయిలో విమర్శలు చేస్తున్నారు.స్వయంగా కుటుంబ సభ్యురాలు కావడంతో ఆమెకు అన్ని విషయాల మీద పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. అందువల్లే ఆమె పాఠం చెప్పినట్టుగా విమర్శలుచేస్తున్నారు. హరీష్ రావుకు 450 ఎకరాల్లో ఫామ్ హౌస్ ఉందని.. త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ఆయన కోసమే మార్చారని.. ఇలా రకరకాలుగా ఆరోపణలు చేశారు కల్వకుంట్ల కవిత. ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెడ్డిపల్లి,చిప్పలదుర్తి, తుంకి గ్రామాలలో దాదాపు 450 ఎకరాలను హరీష్ రావు కొనుగోలు చేశారని.. వాటిని తన వ్యవసాయ క్షేత్రంగా మార్చారని కవిత ఆరోపించారు. ఆ వ్యవసాయ క్షేత్రంలో ఒక రిసార్ట్ కూడా ఉందని కవితఆరోపించారు. అందులోకి ఎవరినీ అనుమతించరని కవిత ఆరోపించారు.“ఇటీవల హరీష్ రావు తండ్రి చనిపోయారు. అప్పటికే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వచ్చింది. బీఆర్ఎస్ ప్రచారంమొదలుపెట్టింది. తండ్రి



చనిపోయాడు కాబట్టి హరీష్ రావు ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయినప్పటికీ ఆయన జూబ్లీహిల్స్ ప్రచారాన్ని చేస్తున్నట్టు అనుచరులు సోషల్ మీడియాలో డబ్బా కొట్టారు. చివరికి జూబ్లీహిల్స్ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత హరీష్ రావు ఉండి ఉంటే బాగుండేదని వ్యాఖ్యలు చేస్తున్నారు. కేటీఆర్ సోషల్ మీడియాని వదిలిపెట్టి బయటికి రావాలి. ట్విట్టర్ కు దూరంగా ఉండాలి.. కేటీఆర్, హరీష్ రావు కృష్ణార్జునులు ఉంటారు.. ఒకళ్ళ మీద ఒకరు బాణాలు వేసుకుంటే కార్యకర్తలు ఆగమవుతారు కదా” అని కవిత ఆరోపించారు..మెదక్ జిల్లాలో విద్య వ్యవస్థ దయనీయ పరిస్థితుల్లో ఉంది. మహా నాయకులు ఉన్న ప్రాంతంలో ఇలాంటిపరిస్థితి ఉంటది అని ఎవరు ఊహించరు %–% జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

# నవీన్ యాదవ్ కు కీలక పదవి...



**హైదరాబాద్, నవంబర్ 17,**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచిన నవీన్ యాదవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి కీలక పదవి కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ విప్ పదవి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. సామాజిక, ప్రాంతీయ సమీకరణాలతోపాటు, యాదవ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలనేది కాంగ్రెస్ వ్యూహం. ఈ పదవితో నవీన్ యాదవ్ పలుకుబడి పెరిగి, గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ బలోపేతం అవుతుందని అంచనా.హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో ఘన విజయం సాధించిన నవీన్ యాదవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలకమైన పదవిని కట్టబెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసినవెంటనే ఆయనకు ప్రభుత్వ విప్ పదవిని ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రభుత్వ విప్ పదవి రాష్ట్ర మంత్రి హోదాకు సమానమైన గౌరవాన్ని, అధికారాలను కలిగి ఉంటుంది.ప్రభుత్వ విప్ పదవికి నవీన్ యాదవ్‌ను ఎంపిక చేయడానికి ప్రధానంగా సామాజిక, ప్రాంతీయ సమీకరణాలే కారణమని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది.తెలంగాణ ప్రభుత్వంలో ప్రస్తుతం ముగ్గురు విప్‌లు ఉన్నారు. మరో
నలుగురిని నియమించుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంది. ఈ ఖాళీలలో ఒకదాన్ని నవీన్ యాదవ్‌కు కేటాయించడం ద్వారా పలు రాజకీయ లక్ష్యాలను చేరుకోవాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది. ఇటీవల జరిగినమంత్రివర్గ విస్తరణలో హైదరాబాద్ జిల్లా నుంచి అజారుద్దీన్‌ను మంత్రిగా కేబినెట్‌లోకి తీసుకున్నారు. ఒకే జిల్లా నుంచి మరో మంత్రి పదవి ఇవ్వడం సాధ్యం కాదని నిర్ణయానికి వచ్చిన కాంగ్రెస్ అధిష్టానం.. విప్ పదవిద్వారా మంత్రి స్థాయి హోదాను అందించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.నవీన్ యాదవ్ బలమైన బీసీ సామాజికవర్గానికి చెందినవారు కావడం ముఖ్యమైన అంశం. బీసీలకు పాలనలో తగిన ప్రాధాన్యంఇస్తున్నామని సందేశం ఇవ్వడానికి ముఖ్యమంత్రి ఈ నిర్ణయానికి మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో యాదవ సామాజిక వర్గం పెద్ద సంఖ్యలో ఉండటం కూడా మరో కారణంగా తెలుస్తోంది.ఇంతకాలం గ్రేటర్ పరిధి నుంచి ఆ సామాజిక వర్గానికి చెందిన బలమైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో లేరు. ఇప్పుడు నవీన్ యాదవ్ విజయం సాధించి, ఎమ్మెల్యేగా ఎన్నికవడం ద్వారా ఆయనకు విప్ పదవిఇవ్వడం వల్ల యాదవ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీలో అత్యధిక ప్రాధాన్యం దక్కినట్లు అవుతుంది. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, భవిష్యత్తు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లోని యాదవ ఓటుబ్యాంకును పటిష్టం చేసుకోవడానికి ఈ నిర్ణయం వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని అధిష్టానం అంచనా వేస్తోంది.ప్రభుత్వ విప్ హోదా కేవలం శాసనసభ వ్యవహారాలకే పరిమితం కాదు. ఈ హోదాతో నవీన్‌యాదవ్‌కు నగరంలోని ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు, అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో నేరుగా సమావేశాలు నిర్వహించేందుకు, ప్రభుత్వ కార్యక్రమాలలో చురుకుగా
పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, విప్ హోదాకు ఉండే అధికారం, అధికారిక వాహనం, కార్యాలయం, ఇతర ప్రోటోకాల్ సౌకర్యాలు నగరంలో ఆయన పలుకుబడిని పెంచుతాయి. ఈ పదవి ద్వారానగరంలో కాంగ్రెస్ పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు, యాదవ సామాజిక వర్గంతో కాంగ్రెస్ బంధాన్ని పటిష్టం చేసేందుకు వీలుంటుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి నిర్ణయంపై త్వరలోనే
**అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.**

**ఓటమి నుంచి పాఠాలు**

4 సార్లు ఓడిపోయినా.. పోరాటం ఆపలేదు. మళ్లీ బరిలో నిలిచాడు. కసిగా పోరాడి, గెలిచాడు. ఆయనే నవీన్ యాదవ్. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఆయన కాంగ్రెస్ పార్టీ టికెట్ సాధించడం నుంచి.. 25 వేల మెజార్టీతోగెలిచే వరకూ ప్రతిదీ పోరాటమే. 16 ఏళ్ల రాజకీయ జీవితంలో 4 వరుస ఓటములు ఎదర్కొన్నారు నవీన్ యాదవ్. అయినా.. రాజకీయాలను విడిచిపెట్టలేదు. ఓటములనే ఒక్కొక్క మెట్టుగా చేసుకొని చివరికిఅనుకున్నది సాధించారు. తెలంగాణ అసెంబ్లీలో గర్వంగా అడుగుపెట్టనున్నారు. వల్లాల నవీన్ యాదవ్ 1983 నవంబర్ 17న చిన్న శ్రీశైలం యాదవ్, భారతి దంపతులకు జన్మించారు. హైదరాబాద్‌లోనియూసుఫ్‌గూడలో పెరిగారు. ఆర్కిటెక్చర్ విభాగంలో బీ.ఆర్క్. పూర్తి చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తూ జీవితంలో పైకెదిగారు. నవీన్ యాదవ్‌కు భార్య వర్ష, కుమారుడు అన్ష్ యాదవ్ ఉన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఎదుగుతూనే.. రాజకీయాల్లో ప్రవేశించారు నవీన్ యాదవ్. చిన్న వయస్సులోనే రాజకీయాల్లో అడుగుపెట్టారు. ఇదే సమయంలో ‘నవ యువ’ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి ప్రజా సేవచేస్తూ.. గుర్తింపు పొందారు. తనకు అండగా నిలిచిన వారి కోసం ఎంత దూరమైనా వెళ్తారనే పేరు సంపాదించారు. అదే ఈరోజు ఆయన గెలుపుకు కారణమైంది. దీనికి తోడు సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలు.. భారీ మెజార్టీసాధించేందుకు దోహదపడ్డాయి. నవీన్ యాదవ్.. రాజకీయ అరంగేట్రమే ఓ సంచలనం. ఆయన తొలిసారిగా 2009లో ఎంఐఎం పార్టీ నుంచి యూసుఫ్‌గూడ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేశారు. ముస్లింల పార్టీగాపేరున్న మజ్లిస్ పార్టీ నుంచి ఒక హిందూ అభ్యర్థిగా బరిలోకి దిగి అందరినీ ఆశ్చర్యపరిచారు. అయితే, టీడీపీ అభ్యర్థి మురళీ గౌడ్ చేతిలో ఆ ఎన్నికలో ఓటమి పాలయ్యారు. ఇక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత2014లో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగారు నవీన్ యాదవ్. ఈసారి కూడా ఎంఐఎం పార్టీ నుంచే. ఈ ఎన్నికల్లో గెలవకపోయినా.. 41,656 ఓట్లుసాధించి రెండో స్థానంలో నిలిచి రాజకీయ వర్గాలను షాక్‌కు గురిచేశారు. నాటి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాగంటి గోపీనాథ్.. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇక 2015లో మరోసారి ఎంఐఎం
అభ్యర్థిగా రహ్మత్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేశారు నవీన్ యాదవ్. ఆ ఎన్నికల్లోనూ ఓటమిని చవిచూశారు. ఇలాంటి ఎదురుదెబ్బలతో ఎవరైనా వెనుకడుగు వేస్తారు. ‘కానీ, భయపడే కులంలోపుట్టలేదు.. భయపడే తండ్రికి పుట్టలేదు’ అని చెప్పే నవీన్ యాదవ్.. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ మద్దతు లేకుండా ఇండిపెండెంట్ అభ్యర్థిగా జూబ్లీహిల్స్ నుంచి మళ్లీ బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో18,817 ఓట్లు సాధించారు. ఆ తర్వాత 2023లో నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాడు ఆయన తీసుకున్న నిర్ణయం ఆయన రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పింది. ఈఏడాది జూన్‌లో మాగంటి గోపీనాథ్ అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో.. జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం మాజీ మంత్రులు సహా.. మహామహులు పోటీ పడ్డారు. అన్నిఅడ్డంకులను తట్టుకొని, జూబ్లీహిల్స్ టికెట్ సాధించడమే నవీన్ యాదవ్ తొలి విజయం. ఇక ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. బీఆర్ఎస్ పార్టీ.. రౌడీయిజం అని విమర్శించినా, హైడ్రా బుల్డోజర్లు వస్తాయని భయపెట్టినా,
రేవంత్ రెడ్డి పాలనకు రెఫరెండం అని ప్రచారం చేసినా.. నవీన్ యాదవ్ గెలుపును అవేవీ అడ్డుకోలేకపోయాయి. పదేళ్లుగా తను పడ్డ కష్టం ఫలించింది. నియోజకవర్గంపై సాధించిన పట్టు ఉపయోగపడింది. నాలుగుఓటములు నేర్పిన పాఠాలు నవీన్ యాదవ్‌ను చివరికి విజయ తీరాలకు చేర్చాయి. ఇక సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ చాతుర్యం నవీన్ యాదవ్‌కు బాగా కలిసొచ్చింది. జూబ్లీహిల్స్‌లో పెద్ద సంఖ్యలో ఉన్న ముస్లిం ఓటర్లనుఆకట్టుకునేందుకు అజారుద్దీన్‌కు ఎన్నికలకు కాస్త ముందే మంత్రి పదవి కేటాయించారు. ఎంఐఎంతో సఖ్యత పెంచుకొని.. ఆ పార్టీ నుంచి అభ్యర్థిని నిలబెట్టకుండా చూడటమే కాకుండా.. ఎంఐఎం ఓటు బ్యాంకునుకాంగ్రెస్‌కు మళ్లించడంలో సఫలమయ్యారు రేవంత్ రెడ్డి. కృష్ణా నగర్, యూసుఫ్‌గూడ ప్రాంతంలో ఎక్కువగా ఉండే.. సినీ కార్మికులతో మీటింగ్ పెట్టి, వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి.. ఆ ఓట్లనుతిప్పుకున్నారు. మైత్రివనం కూడలిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పి ఓ వర్గం ఓట్లను ఆకర్షించారు. కమ్మ, కాపు వర్గాలతో మీటింగ్‌లు పెట్టించి వారి ఓట్లను తమవైపు తిప్పుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి
మాగంటి సునీత.. సానుభూతిని ప్రధాన అస్త్రంగా ఎంచుకోగా.. పీజేఆర్ మృతి సమయంలో బీఆర్ఎస్ వ్యవహరించిన తీరును గుర్తుచేసి.. వారి ప్రచారాన్ని తిప్పికొట్టారు రేవంత్ రెడ్డి.

## కవితపై అవినీతి బాణం ఎక్కుపెట్టిన బీఆర్ఎస్..

## లిక్కర్ స్కాంలో పాత్రపై ధ్రువీకరణ!

తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తనయ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు భారీగా అక్రమాలకు పాల్పడ్డారనిఆరోపించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వెన్నుపోటు పొడిచారని సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో హరీశ్‌రావు%–%కవిత మధ్య వార్ మరోసారి చర్చనీయాంశమైంది. తెలంగాణ రాజకీయాలను వేడెక్కించింది.కవిత మెదక్‌లో చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలు స్పందించారు. తెలంగాణను అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ అని.. కానీ కవిత కారణంగానే పార్టీ నష్టపోయిందని బీఆర్ఎస్ నేత మల్లికార్జునగౌడ్ సంచలన ఆరోపణచేశారు. కవిత అక్రమ సంపాదనపై నిగ్రహం లేకుండా వ్యవహరించడంతో, ‘కుటుంబ పాలన’ ముద్రను బీఆర్ఎస్ తొలగించవలసిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కవిత వ్యవహారమే పార్టీని భ్రష్టు పట్టిందనిఆరోపించడం ఇప్పటి రాజకీయ దృశ్యాన్ని కలవరపరిచింది. తన మాటల్లో ‘పార్టీలో అవినీతిని కవిత నవీకరించిందని, హరీశ్‌రావుపై కూడా ఆరోపణలు చేయడం ద్వారా కుటుంబంలోనే విభేదాలు పెరిగాయా?‘ అన్నసందేహం మిగిలింది.బీఆర్ఎస్ ప్రెస్‌మీట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు విమర్శలతో విరుచుకుపడుతున్నారు. “పార్టీలోనే దొంగలు ఉన్నారు”, “హరీశ్ రెంటు నుంచి కోట్లకు
వెళ్లాడు”, “అదే నోరు అప్పటి ఆరోపణలకు ఉండలేదా?” వంటి ప్రశ్నలు వేస్తున్నారు. ‘లిక్కర్ స్కాం నిజమైతే గత ధర్నాలు, నిప్పు%–%సద్దుల్లో నిజమెక్కడ?‘ అనే వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇవి పార్టీనైతికతను ప్రశ్నిస్తున్నాయి. పార్టీలో ఉన్నప్పుడు పూజలు, బైటకు వెళితే నిందలా అని నిలదీస్తున్నారు. కార్టూను స్టైల్‌లో “సారుంకారు= ఇక రారు” మీమ్స్ పోస్టు చేస్తున్నారు.బీఆర్ఎస్ ముఖ్య నాయ్కత్వంపైలిక్కర్ స్కాం జరగలేదని ఆరోపించారు. కానీ ఇప్పుడు కవిత విషయంలో స్కాం జరిగిందని, కవిత స్కాం చేసిందని ధ్రువీకరిస్తున్నారు. అందుకే పార్టీ నాశనం అయిందని, పేర్కొంటున్నారు. కుటుంబ పాలనపై ప్రతిపక్ష
విమర్శలకు కవిత వ్యవహారమే బలంగా మారింది.

## నెలాఖరులోగా స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపుతో కాంగ్రెస్ ప్రభుత్వం జోష్‌లో ఉంది. ఈ ఉత్సాహంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతోంది. అయితే.. బీసీ రిజర్వేషన్ల అంశం ప్రధాన సవాలుగా మారింది. సుప్రీంకోర్టుఆదేశాల మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు. దీంతో, బీసీ రిజర్వేషన్లపై అధికారులు 50 శాతం పరిమితిలోనే ఉండేలా కొత్త నివేదికను రూపొందించారు. ఈ నిర్ణయంపై బీసీల నుంచి వ్యతిరేకత రాకుండానాయకులకు వివరించాలని సీఎం మంత్రులకు సూచించారు. ఈ నెలాఖరులోగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊహించని ఉత్సాహాన్ని,రాజకీయంగా కొత్త బలాన్ని ఇచ్చింది. ఈ గెలుపును పునాదిగా చేసుకుని.. ప్రభుత్వం ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా.. గ్రామీణ ప్రాంతాల్లో తమ పట్టునుమరింత బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలను ఒక సువర్ణావకాశంగా కాంగ్రెస్ భావిస్తోంది. దీనిలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.స్థానిక సంస్థల ఎన్నికలకుసంబంధించి బీసీ (వెనుకబడిన తరగతుల) రిజర్వేషన్ల అంశం ప్రభుత్వం ముందు ఉన్న అతిపెద్ద సవాలుగా మారింది. గతంలో ప్రవేశపెట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టపరమైన (లీగల్) సమస్యలు, అడ్డంకులుఎదురవుతున్న నేపథ్యంలో.. అధికారులు మరో నివేదికను సిద్ధం చేశారు.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50
శాతం మించకూడదు. ఈ న్యాయపరమైన పరిమితిని దృష్టిలో ఉంచుకుని.. మొత్తం 50 శాతం పరిమితిలోనే బీసీలకు రిజర్వేషన్లు కేటాయించేలా అధికారులు మార్గాలను అన్వేషించారు. దీనికి సంబంధించి ఒక సమగ్రనివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.బీసీ రిజర్వేషన్లను 50 శాతం పరిమితికి లోబడి కేటాయించడం వల్ల, కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో..
ముఖ్యమంత్రి మంత్రులకు కీలక సూచనలు ఇచ్చినట్లు సమాచారం. బీసీల నాయకులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడి.. న్యాయపరమైన చిక్కుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని, ఇది కేవలంతాత్కాలికమేనని వివరించాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. బీసీ సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని, భవిష్యత్తులో వారికి మరింత న్యాయం చేసే ప్రణాళికలను వివరించడం ద్వారా ఎన్నికలకు వెళ్లాలనికాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది.ప్రస్తుత పరిణామాలు గమనిస్తే.. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెలాఖరులోగా లేదా తదుపరి నెల మొదటి వారంలోగా వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ఎన్నికలుగ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి కొత్త స్థానిక నాయకత్వాన్ని అందించి, పార్టీ బేస్ ను మరింత బలోపేతం చేస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. అలాగే.. ఎన్నికల తర్వాత కూడా తమ ఆరు గ్యారంటీల అమలుకుస్థానిక సంస్థల ద్వారా మరింత వేగం పుంజుకోవచ్చని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ స్థానిక ఎన్నికలు తెలంగాణ రాజకీయాలపై, ముఖ్యంగా గ్రామీణ ఓటర్లపై కాంగ్రెస్ పట్టును స్పష్టంగా తెలియజేస్తాయి.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం తర్వాత కాంగ్రెస్ కు ఆత్మవిశ్వాసం పెరిగిపోయింది.. ఈ ఊపులోనే స్థానిక సంస్థలకు వెళ్తే బాగుంటుంది అనేది ప్రభుత్వం భావిస్తోంది.

## మావోయిస్టు పార్టీకి మరో భారీ దెబ్బ -

:తెలంగాణలో మావోయిస్టు ఉద్యమానికి మరో భారీ దెబ్బ తగిలే సూచనలు కనిపిసతున్నాయి. నిషేధిత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) %–% సిపిఐ(మా) పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యడసాంబయ్య అలియాస్ ఆజాద్ అలియాస్ గోపన్న , డివిజన్ కమిటీ సభ్యుడు అప్పాసి నారాయణ అలియాస్ రమేష్‌తో పాటు వారి క్యాడర్ 20 మంది లొంగిపోతున్నట్లు విశ్వసనీయమైన సమాచారం వెలుగులోకివచ్చింది. ఈ సరెండర్ వచ్చే వారం రోజుల్లో జరిగే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ పోలీసులు ‘ఆపరేషన్ చెయుత’ పేరుతో లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నారు. 2025లో ఇప్పటికే 427 మంది మావోయిస్టులులొంగిపోయారని, వీరిలో సీనియర్ నేతలు కూడా ఉన్నారని డీజీపీ బి. శివధర్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ అలియాస్ గోపన్న భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు జిల్లామొద్దుల గూడెం గ్రామానికి చెందిన వారు. 1995 నుంచి అజ్ఞాతంలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు (బీకేజీ–ఏఎస్ఆర్) డివిజన్ కమిటీ మాజీ కార్యదర్శి. రాష్ట్రకమిటీ సెక్రటరీ హరిభుషణ్ మరణం తర్వాత లీడర్‌షిప్ పోటీలోఉన్నారు.

# ఏఐతో వైద్య రంగంలో అద్భుతాలు.. వేగంగా వ్యాధి నిర్ధారణ, చికిత్సలు





మనిషి తన మేథస్సుతో (ఇంటెలిజెన్స్) నాటి నుంచి నేటి వరకు ఎంతో పురోగతి సాధించగా, ఇప్పుడు కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ఏఐ) ప్రపంచాన్ని మరింత ఆధునికత వైపు తీసుకెళ్లనుంది. ఎన్నో రంగాల్లో కృత్రిమ మేథ అనివార్యం కాగా, ముఖ్యంగా వైద్యం, ఆరోగ్య సంరక్షణ రంగాన్ని ఇది కొత్త పుంతలు తొక్కించనుంది. రోగుల సంక్షేమం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స ఇలా మొత్తంగా ఆరోగ్య నిర్వహణను వేగవంతం, సమర్థవంతంగా మార్చడమే కాదు, సులభతరం చేయనుంది. ఆరోగ్య సంరక్షణ, వైద్య సేవల్లో ఏఐ ఏ విధమైన మార్పులు తీసుకురానుందనే విషయాన్ని గమనించినట్టయితే..

**వ్యాధి నిర్ధారణ పరీక్షలు/కచ్చితమైన చికిత్సలు**

ఒక ల్యాబ్ టెక్నీషియన్ ఒక రోజులో కొన్ని నమూనాలనే పరీక్షించగలడు. కానీ, ఏఐ ఆధారిత మెషిన్లు తక్కువ సమయంలోనే వేలాది పరీక్షలు నిర్వహించగలవు. దీనివల్ల ఫలితాల్లోనూ కచ్చితత్వం పెరుగుతుంది. ఇదంతా ప్రోగ్రామింగ్ పైనే ఆధారపడి ఉంటుంది. ఒక వైద్యుడు ఒక రోగి కోసం మహా అయితే కొన్ని నిమిషాలే కేటాయించగలడు. రోజువారీగా ఉండే రోగుల రద్దీపైనే ఎంత సమయం వెచ్చించడం అన్నది ఆధారపడి ఉంటుంది. క్లిష్టమైన ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్యులు ఎన్నో పరీక్షలు రాస్తుంటారు. అవి చేయించుకుని రిపోర్టులు తీసుకెళ్లి ఇస్తే వాటిని వివరంగా చూసే తీరిక వారికి ఉండదు. వేగంగా పేజీలు తిప్పేసి మందులు రాసి పంపిస్తుంటారు. దీనివల్ల అన్ని సందర్భాల్లోనూ సమస్యలు వెంటనే నయం అవుతాయన్న గ్యారంటీ ఉండదు. కానీ ఏఐ దీన్ని మరింత సమర్థవంతంగా మార్చగలదు. ఒక రోగికి సంబంధించి ఇమేజ్ లు, రికార్డులు అన్నింటినీ ఏఐ పరిశీలించి ఒక చక్కని నివేదిక ఇవ్వగలదు. ఎక్స్ రే, ఎంఆర్ఐ, స్కాన్, సీటీ స్కాన్ ఇమేజ్ లను మనుషులతో పోలిస్తే ఏఐ మరింత కచ్చితంగా విశ్లేషించగలదు. దీనివల్ల మానవ తప్పిదాలను నివారించొచ్చు. ఇమేజ్ ల ఆధారంగా రోగికి ఉన్న సమస్యపై ఏఐ ఇచ్చిన నివేదికను రేడియాలజిస్టులు, ఇతర స్పెషలిస్ట్ వైద్యులు సులభంగా అర్థం చేసుకోగలరు. అవసరమైతే వారు కూడా మరోసారి వేగంగా ఇమేజ్ ను పరిశీలించగలరు. సమయం ఆదాకు తోడు కచ్చితత్వం ఇందులో సాధ్యపడుతుంది.

ఇప్పుడు చాట్ జీపీటీ ఏం చేస్తుందో చూస్తున్నారుగా.. ఏది అడిగినా దాదాపు చక్కని సమాచారాన్ని వేగంగా మన ముందు ఉంచుతోంది. ఆ సమాచారం అంతా కూడా నెట్ పేజీల నుంచే తెస్తోంది. అలాగే, వ్యాధి నిర్ధారణలోనూ ఒక రోగికి సంబంధించిన రికార్డులను ఏఐ టెక్నాలజీ అద్భుతంగా విశ్లేషించి, వేగంగా నివేదిక ఇవ్వగలదు. ఈ నివేదిక ఆధారంగా రోగికి ఎలాంటి చికిత్స అవసరమో డాక్టర్ సులభంగా నిర్ణయించి సూచించగలరు. అప్పుడు డాక్టర్లు, రోగుల సమయం కూడా ఆదా అవుతుంది. వైద్యులపై పని భారం తగ్గుతుంది. దాంతో వారు రోగుల సంరక్షణపై మరింత సమయం వెచ్చించగలరు. మెరుగైన వైద్యానికి వీలు పడుతుంది.

రోగికి సరైన ఔషధాలు సూచించడం చికిత్సలో అత్యంత కీలకమైన అంశం అవుతుంది. ఏఐ దీన్ని మరింత మెరుగుపరుస్తుంది. రోగి జన్యువులు, జీవనశైలి విధానం, వ్యాధి నిర్ధారణ పరీక్షల సమాచారం వీటన్నింటినీ ఏఐ విశ్లేషిస్తుంది. దీంతో విడిగా ఒక్కో రోగికి అనుకూలమైన, సమర్థవంతమైన చికిత్స అందించడం సాధ్యపడుతుంది. రోగి డేటా ఆధారంగా భవిష్యత్తులో రాబోయే ఆరోగ్య సమస్యలను కూడా ఏఐ టెక్నాలజీ ముందే గుర్తించగలదు. దీంతో వాటి నివారణపై దృష్టి పెట్టడం వీలవుతుంది.

**ఔషధ పరిశోధన వేగవంతం**

ఒక కొత్త ఔషధాన్ని పరిశోధించి మార్కెట్లోకి తీసుకురావాలంటే కనీసం పదేళ్లు పడుతుంది. ఏఐ దీన్ని మరింత వేగవంతం చేయగలదు. క్లిష్టమైన బయోలాజికల్ డేటాను ఏఐ సులభంగా విశ్లేషించగలదు. అది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కనుక మనిషికి ఉండే పరిమితులు ఉండవు. తప్పులను దాదాపు నివారించొచ్చు. ప్రభావవంతమైన ఔషధాలను గుర్తించగలదు. వాటి సామర్థ్యాన్ని తేల్చగలదు. దీనివల్ల తక్కువ సమయంలోనే సమర్థవంతమైన నూతన ఔషధాలను తీసుకురావడం వీలు పడుతుంది. దీనివల్ల ఎంతో ఖర్చు ఆదా అవుతుంది. ముఖ్యంగా క్లినికల్ ట్రయల్స్ లో డేటా పరంగా ఏఐ ఎంతో ఉపయోగపడుతుంది. ఔషధ పరీక్షల్లో డేటాకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. అంతేకాదు ఒక ఔషధానికి సంబంధించి వేలు, లక్షలాది పేజీల డేటా ఉంటుంది. దీన్ని కచ్చితత్వంతో విశ్లేషించడం మనుషుల కంటే ఈ టెక్నాలజీయే సమర్థవంతంగా, వేగంగా చేయగలదు.

> **క్లిష్టమైన డేటాను ఏఐ సులభంగా విశ్లేషించగలదు**
>
> **మానవ పరమైన తప్పిదాలకు చెక్**
>
> **వైద్యుల పని సులభతరం**
>
> **దీంతో రోగులకు మెరుగైన వైద్య సూచనలు**
>
> **రోగి ఇంటి నుంచే చికిత్సలకు వెసులుబాటు**
>
> **వేగంగా నూతన ఔషధాల పరిశోధన**

**టెలీ హెల్త్**

ఏఐ వల్ల మరో సౌలభ్యం ప్రతిదానికీ రోగి వైద్యుడి వరకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. రోగి తాను ఉన్న చోట నుంచే ఈ టెక్నాలజీ సాయంతో వైద్యుడి సలహా, సూచనలు పొందొచ్చు. టెలీ హెల్త్ రూపంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ సేవలను ఏఐ మరింత మెరుగుపరుస్తుంది. వేగవంతం చేస్తుంది. రోగి ఎక్కడున్నా, అతడికి సంబంధించిన తాజా సమాచారం ఏఐ ఆధారిత హెల్త్ గ్యాడ్జెట్ల (పరికరాలు) సాయంతో వైద్యుడికి చేరవేయగలదు. బ్లడ్ షుగర్, బీపీ, ఆక్సిజన్, హృదయ స్పందనలు తదితర ప్యారా మీటర్లు ఎలా ఉన్నదీ వైద్యులకు ఏఐ ఎప్పటికప్పుడు తాజా సమాచారం ఇస్తుంది. దాంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యుడు సూచిస్తాడు. ముఖ్యంగా వైద్య సేవలు అంతగా అందుబాటులో లేని మారుమూల ప్రాంతాలకు ఇది ఎక్కువ ఉపయోగకరం. మెరుగైన వైద్య సేవలను వేగంగా అందించడంలో సాయపడుతుంది. కొన్ని సర్జరీల తర్వాత రోగులు కోలుకోవడాన్ని ఏఐ టెక్నాలజీతో పర్యవేక్షించొచ్చు. గాయపడిన వారు, వైకల్యంతో బాధపడే వారు చికిత్సతో పొందుతున్న ఫలితాలను వైద్యులు రిమోట్ గా విశ్లేషించడం సాధ్యపడుతుంది.


**నిర్వహణ సులభతరం**

వైద్యుల అపాయింట్ మెంట్, పేషెంట్ రికార్డుల నిర్వహణ, బీమా క్లెయిమ్ ల వ్యవహారాలు చూడడాన్ని ఏఐ చేయగలదు. దీనివల్ల విలువైన మానవ వనరులను ఆదా చేసుకోవచ్చు. దీనివల్ల ఖర్చు కూడా తగ్గుతుంది.

**వైద్య విద్య కొత్త పుంతలు**

వైద్య విద్యలో ప్రాక్టికల్స్ కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఏఐ దీన్ని నవీకరించగలదు. మెడికల్ కోర్సులు చేసే అభ్యర్థులకు నేర్చుకోవడాన్ని సులభతరం చేస్తుంది. వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ ఇందుకు సాయపడతాయి. ఇవి కాకుండా వైద్య రంగంలో సరఫరా వ్యవస్థ ఎంతో కీలకమైనది. కరోనా వచ్చినప్పుడు సప్లయ్ చైన్ లో సమస్యలను చూశాం. కానీ, ఏఐ టెక్నాలజీ విరివిగా అందుబాటులోకి వస్తే సప్లయ్ చైన్ మరింత బలపడుతుంది. ఔషధాలు, ఉపకరణాలు తదితర ఇన్వెంటరీ నిర్వహణ, అసలు డిమాండ్ ఎంత మేర ఉంది, దానికి తగ్గట్టు వేగంగా సరఫరా ఎలా చేయాలి? అనేది ఏఐతో సులభతరం అవుతుంది. దీనివల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుంది. వైద్య రంగంలో వస్తున్న మార్పులు, కొత్త వ్యాధులు ప్రబలడం తదితర సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తూ, విశ్లేషిస్తూ ముందస్తు నివారణ చర్యలను సైతం ఏఐ సూచించగలదు.







## వామ్మో స్మార్ట్ వాచ్ వాడుతున్నారా?.. కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయట జాగ్రత్త



రోజువారీ పనుల్లో ఇంపార్టెంట్ అప్‌డేట్స్, మరీ ముఖ్యంగా హెల్త్ అప్‌డేట్స్ కోసం స్మార్ట్ వాచ్ వాడతారు. అయితే దీనివల్ల కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయి. కొంతమందికి స్మార్ట్ వాచ్ వల్ల చర్మ సమస్యలు రావొచ్చు. అలాంటివాళ్లు వాచ్?ను బిగుతుగా పెట్టుకోకూడదు. అలాగే కొందరికి స్మార్ట్ వాచ్‌ల నుంచి వచ్చే రేడియేషన్? వల్ల తలనొప్పి లేదా వికారం లాంటి సమస్యలు వస్తాయి. అలాంటి సమస్యలు వస్తుంటే స్మార్ట్ వాచ్ వాడకం తగ్గించడం బెటర్. చాలామందికి నిద్రలేమి సమస్యలు కూడా వస్తున్నాయి. కాబట్టి నిద్రపోయే ముందు స్మార్ట్ వాచ్? తీసేయాలి. నిజానికి స్మార్ట్ వాచ్? అనేది హెల్త్?ని బెటర్ చేసేందుకు ఉపయోగపడే సాధనం. కానీ, దాన్ని అతిగా వాడితే అనారోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉంది అని ఎక్స్?పర్ట్స్ హెచ్చరిస్తున్నారు.

## డిసెంబర్నుంచి ఆగిపోనున్న ఎస్‌బీఐ ఎంక్యాష్ ఫీచర్




న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఎస్‌బీఐ, యోనో లైట్‌లో ఈ నెల 30 తర్వాత నుంచి ఎంక్యాష్ ఫీచర్‌ను ఉపయోగించడానికి వీలుండదు. స్టేట్ బ్యాంక్ ఇండియా (ఎస్‌బీఐ) ఈ సౌకర్యాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. గతంలో బెనిఫిషరీ రిజిస్ట్రేషన్ చేయకుండానే ఎంక్యాష్ ద్వారా ఎవరికైనా డబ్బు పంపడానికి వీలుండేది. మొబైల్ నెంబర్ లేదా ఈమెయిల్ ఉంటే సరిపోయేది. కస్టమర్లు యూపీఐ, ఐఎంపీఎస్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ వంటి డిజిటల్ చెల్లింపు మార్గాలను ఉపయోగించాలని ఎస్‌బీఐ సూచించింది.

**ఎంక్యాష్ ఎలా పనిచేస్తుందంటే?**

ఎస్‌బీఐ కస్టమర్ తమ ఆన్‌లైన్ బ్యాంకింగ్ అకౌంట్ లేదా యోనో ద్వారా పంపిన డబ్బును ఎంక్యాష్ యాప్ ద్వారా బెనిఫిషరీ క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ ట్రాన్సాక్షన్ పూర్తి చేయడానికి పాస్‌కోడ్ అవసరం. డబ్బు పంపిన ఎస్‌బీఐ కస్టమర్ 8 అంకెల పాస్‌కోడ్ సెట్ చేస్తారు. ఎవరికి డబ్బు పంపారో వారి మొబైల్ నెంబర్ లేదా ఈ%-%మెయిల్‌కు ఈ పాస్‌కోడ్ డిటెయిల్స్ వెళతాయి. ఎంక్యాష్ ద్వారా ఏ బ్యాంక్ ఖాతాలోకైనా ఫండ్స్‌ను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌ను ఫేవరెట్‌గా సేవ్ చేసుకోవచ్చు.

## ఫ్రిడ్జ్ టెంపరేచర్ను మారుస్తున్నారా?



సాధారణంగా ఫ్రిడ్జ్‌ని వేసవిలోనే ఎక్కువగా వాడతారు. అప్పుడు టెంపరేచర్స్ ఎక్కువగా ఉంటాయి. దాంతో ప్రతి పది నిమిషాలకు ఒకసారి ఫ్రిడ్జ్?ను తెరుస్తుంటారు. అయితే వర్షాకాలం, శీతాకాలంలో వాతావరణం చల్లగా ఉంటుంది. కాబట్టి ఫ్రిడ్జ్‌తో పెద్దగా పని ఉండదు. అలాంటప్పుడు ఫ్రిడ్జ్ టెంపరేచర్ తగ్గించుకోవచ్చు. దాని వల్ల కరెంట్ వాడకం కూడా తగ్గుతుంది. కానీ, చాలామంది ఈ సెట్టింగ్స్ గురించి పట్టించుకోకుండా సంవత్సరమంతా ఒకే టెంపరేచర్‌లో ఉంచుతారు. దానివల్ల ఉపయోగం లేదు.. కరెంట్ బిల్ కూడా ఎక్కువే. కాబట్టి ఈ వింటర్ సీజన్‌లో రిఫ్రిజరేటర్ టెంపరేచర్‌ను ఇలా సెట్ చేసుకోండి. ఫ్రిడ్జ్‌లో టెంపరేచర్‌ను కంట్రోల్ చేయడానికి డయల్ లేదా డిజిటల్ ప్యానెల్ ఉంటుంది. దీన్ని సాధారణంగా 0 నుంచి 5 లేదా 1 నుంచి 7 వరకు సెట్ చేసుకోవచ్చు. వేసవిలో ఎలాగూ చల్లదనం ఎక్కువగా కావాలి కాబట్టి 4 లేదా 5కి సెట్ చేసుకుంటారు. కానీ.. ఇప్పుడు శీతాకాలంలో ఫ్రిడ్జ్‌ను 2 లేదా 3కి సెట్ చేసుకుంటే చాలు. ఫ్రీజర్ వింటర్, సమ్మర్ సీజన్‌లలో 18 లేదా 20 డిగ్రీల సెల్సియస్ టెంపరేచర్ ఉండాలి. అయితే ఫ్రిడ్జ్‌లో అన్ని విభాగాల్లో టెంపరేచర్స్ ఒకేలా ఉండవు. కూరగాయల కోసం క్రిస్పర్ డ్రాయర్ వాడాలి. అది తేమను కంట్రోల్ చేస్తుంది. పై అల్మారాలు, డోర్ రాక్‌లు చల్లగా ఉంటాయి. పాలు, రసం లేదా సాస్‌లు వంటి వాటిని అక్కడ స్టోర్ చేయాలి. కింది అల్మారాల్లో కూలింగ్ ఎక్కువ ఉంటుంది. అక్కడ మాంసం లేదా మిగిలిపోయిన వాటిని నిల్వ చేయొచ్చు.

# చందమామలా ఆకట్టుకుంటున్న చాందిని!





చేసేది తక్కువ సినిమాలే అయినా.. అటు అతిథి పాత్రలలో కాసేపు కనిపించినప్పటికీ తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంటూ భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది చాందిని చౌదరి. నటసింహ నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమాలో శివాని పాత్రతో అందరినీ ఆకట్టుకుంది. ఇందులో చేసింది గెస్ట్ పాత్ర అయినా తన పాత్రతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఇప్పుడు సంతాన ప్రాప్తిరస్తు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నవంబర్ 14వ తేదీన థియేటర్లలో విడుదల కాబోతున్న నేపథ్యంలో సినిమాపై అంచనాలు పెంచడానికి ఇటు సోషల్ మీడియాలో ప్రమోషనల్ కార్యక్రమాలు చేపట్టింది ఈ ముద్దుగుమ్మ.అందులో భాగంగానే తాజాగా సోషల్ మీడియాలో యాక్టివ్ గా మారిన చాందిని.. సాంప్రదాయమైన చుడీదార్ లో కనిపించి అందరి మనసులు దోచుకుంది. సాంప్రదాయంగా గ్రీన్ కలర్ చుడీదార్ ధరించి.. జుట్టును కాస్త స్టైల్ చేసి వదిలేసిన ఈమె.. చెవులకు పెద్ద చెవి పోగులు పెట్టుకొని.. తన అందాన్ని మరింత మార్చుకుంది. ఇక మెడను బోసిగా ఉంచిన ఈమె అలా సింపుల్ లుక్ తో అందరి హృదయాలను ఆకట్టుకుంది అని చెప్పవచ్చు. తాజాగా చాందిని చౌదరి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.చాందిని చౌదరి తాజాగా నటిస్తున్న సంతాన ప్రాప్తిరస్తు సినిమా విషయానికి వస్తే.. విక్రాంత్, చాందిని జంటగా నటిస్తున్న ఈ సినిమాను మధుర ఎంటర్టైన్మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి , నిర్వి హరి ప్రసాద్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా మొదటి పాట ' తెలుసా నీకోసమే' లిరికల్ సాంగ్ ను ప్రొడ్యూసర్ సురేష్ బాబు గెస్ట్ గా వచ్చి రిలీజ్ చేశారు. డైరెక్టర్ అజరు అరసాడ ఈ పాటను చాలా అద్భుతంగా కంపోజ్ చేయగా.. శ్రీమణి లిరిక్స్ అందించారు. తన అద్భుతమైన గాత్రంతో పాట పాడి శ్రోతలను అలరించారు.కేటుగాడు సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన చాందిని కలర్ ఫోటో సినిమాతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఆ తర్వాత సమ్మతమే, గామి వంటి చిత్రాలలో నటించిన ఈమె విశాఖపట్నంలో పుట్టి బెంగళూరులో ఇంజనీరింగ్ పూర్తి చేసింది. షార్ట్ ఫిలిమ్స్ ద్వారా కెరియర్ ఆరంభించిన ఈమె.. షార్ట్ ఫిలిమ్స్ క్వీన్ అనే బిరుదును కూడా దక్కించుకుంది. 1991 అక్టోబర్ 23న జన్మించిన చాందిని షార్ట్ ఫిలిమ్స్ ద్వారానే తన నటనను ప్రూవ్ చేసుకొని ఇప్పుడు హీరోయిన్ గా చలామణి అవుతుంది. ఇక త్వరలో రాబోతున్న సంతాన ప్రాప్తిరస్తు సినిమాతో ఎలాంటి సక్సెస్ అందుకుంటుందో చూడాలి.

## 43 ఏళ్లలో కూడా స్టిల్ గ్లామర్.. ఆకట్టుకుంటున్న కొత్త మూవీ పోస్టర్!





కొంతమంది హీరోయిన్స్ వయసు పెరిగినా కూడా వన్నె తరగని అందంతో కుర్ర హీరోయిన్ ల లాగే మెరిసిపోతూ ఉంటారు. అలాంటి వారిలో శ్రియా శరణ్ కూడా ఒకరు.. 43 ఏళ్ల వయసున్న శ్రియా శరణ్ ఇప్పటికీ యంగ్ గానే కనిపిస్తోంది. అయితే తాజాగా శ్రియాకి కొత్త సినిమాకు సంబంధించిన ఒక పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ ఫోటో ప్రస్తుతం ఇంటర్నెట్ మొత్తాన్నీ షేక్ చేస్తోంది. ఈ మేరకు శ్రియా శరణ్ కి సంబంధించిన కొత్త పాట పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ పోస్టర్లో శ్రియా అందం చూసి చాలామంది షాక్ అయిపోతున్నారు. వామ్మో 43 ఇయర్స్ లో కూడా మరీ ఇంత గ్లామర్ ఏంటిరా బాబోయ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.

శ్రియాకి సంబంధించిన ఈ తాజా పోస్టర్లో పింక్ కలర్ మెరిసే దుస్తులను ధరించి ఒక బోల్డ్ ఫోజ్ పెట్టి స్టిల్ ఇచ్చింది. ఈ పోస్టర్ తో మళ్ళీ శ్రియా సినిమాల్లో తన గ్లామర్ తో కుర్రకారుని ఉర్రూతలూగించడానికి సిద్ధమైపోయిందని అనిపిస్తోంది. శ్రియా శరన్ నటిస్తున్న తాజా మూవీ నాన్ వైలెన్స్ నుండి పోస్టర్ విడుదలైన కొద్ది క్షణాల్లోనే అందరి దృష్టిని ఆకర్షించింది. దాంతో ప్రస్తుతం శ్రియా శరన్ కి సంబంధించిన తాజా పోస్టర్ పై చాలా మంది నెటిజన్స్ వైరల్ కామెంట్స్ పెడుతున్నారు.ఇక శ్రియా చివరిసారిగా మిరాయ్ మూవీలో తేజ సజ్జా తల్లి పాత్రలో నటించడంతో పాటు తమిళ హీరో సూర్య నటించిన రెట్రో మూవీలో స్పెషల్ సాంగ్ లో కనిపించింది. అయితే ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ ద్వారా శ్రియా శరన్ కి ఎలాంటి గుర్తింపు కూడా రాలేదు. కానీ ఆమె అభిమానులు మాత్రం శ్రియా మళ్లీ కచ్చితంగా ఏదో ఒక కొత్త సినిమాతో తిరిగి వస్తుందని అనుకున్నారు. అలా ఇప్పుడు తాజాగా ఆనంద్ కృష్ణన్ దర్శకత్వం వహించిన నాన్ వైలెన్స్ అనే మూవీతో మన ముందుకు రాబోతోంది. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న ఈ సినిమాకి సంబంధించిన ఫస్ట్ సాంగ్ రేపు ఉదయం 11 గంటలకు విడుదల కాబోతోంది.అయితే తాజాగా వైబ్ చేయడానికి సిద్ధంగా ఉండండి అంటూ టీ సిరీస్ ఈ పోస్టర్ ని షేర్ చేసింది. ప్రకాశవంతమైన లైట్లు, డాన్సర్ల మధ్య శ్రీయ తన మిరుమిట్లు గొలిపే అందంతో మరింత యంగ్ గా కనిపిస్తోంది.. సరికొత్త ఐటమ్ సాంగ్ ఎంతో శ్రియ మరోసారి తన అభిమానులని అలరించబోతోంది. అయితే ఈ మధ్యకాలంలో కొంతమంది హీరోయిన్లు సినిమాల్లో అవకాశాలు తగ్గాక స్పెషల్ సాంగ్ లని ఎంచుకుంటున్నారు. అలా శ్రియా కూడా స్పెషల్ సాంగ్ ల వైపు అడుగు వేసినట్లు అర్థమవుతుంది. ఇక తాజాగా శ్రియా శరణ్ కి సంబంధించిన ఈ స్పైసీ పోస్టర్ ని బట్టి చూస్తే మాత్రం శ్రియా కచ్చితంగా కం బ్యాక్ ఇస్తుందని ఆమె ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు.